

గత 27 నెలల కూటమి ప్రభుత్వ సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధికి స్థానిక ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు మద్దతు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంపై విశ్వాసం ప్రకటించిన రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

గురువారం 05.11.2026

INK OF TRUTH


జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 195 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

అన్నదాతను ఆదుకోండి

కరువు కోరల్లో చిక్కిన రైతులకు చేయూతనివ్వండి



అమరావతి, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగానికి జరిగిన నష్టాన్ని, ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చేలా కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల అంచనా కోసం రాష్ట్రంలో పర్యటించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) బుధవారం ముఖ్యమంత్రిని కలిసింది. ఈనెల 2, 3 తేదీల్లో రెండు బృందాలుగా కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించిన సభ్యులు తమ కరువు అధ్యయన వివరాలు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలోని తీర ప్రాంతం తుఫాన్ల సమస్యతో ఇబ్బందులు పడుతుంటే... మరోవైపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో కారణంగా రాయలసీమ సహా ఇంకొన్ని ప్రాంతాలు తీవ్ర కరవుతో అల్లాడుతున్నాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆ బృందానికి వివరించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పంట నష్టాలు, రైతుల సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలపై స్పష్టత లభించిందని వెల్లడించారు. రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కంటే గణనీయంగా తక్కువ వర్షపాతం నమోదైందని, దీర్ఘకాలిక వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఐఎంసీటీ సభ్యులకు తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసం సమస్యలు కూడా తలెత్తాయని వివరించారు. అనంతపురం జిల్లాలో దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన పరిస్థితిని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో 21 జిల్లాల్లో 412 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి వారం రోజుల్లో కరువు పరిస్థితులపై కేంద్రానికి నివేదిక కూడా సమర్పిస్తామని సీఎం చెప్పారు.

200 రోజులకు వీబీ జీ రామ్ జీ పనిదినాలు పెంచాలి : ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయితే ప్రకృతి వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో వీబీ జీ రామ్ జీ పథకం కింద కనీస పనిదినాలను 200 రోజులకు పెంచి, వ్యవసాయ రంగానికి అవసరమైన పనులకు ఈ పథకాన్ని వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని కేంద్ర బృందాన్ని కోరారు. దీంతో రైతులకు మానవ వనరుల సమస్య తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కరువు పరిస్థితుల వల్ల రైతుల ఆదాయం గణనీయంగా తగ్గిపోతోందని, వ్యవసాయ రుణాల చెల్లింపులపై కూడా ప్రభావం పడుతోందని ముఖ్యమంత్రి వివరించారు. మిగతా 2లో...

వీబీ జీ రామ్ జీ పనిదినాలు 200కు పెంచాలి

డ్రాట్ కార్డుల జారీకి, జేజేఎం విస్తరణకు సహకరించాలి

కేంద్ర బృందానికి సీఎం విజ్ఞప్తి



తుపాను నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన

గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో సీఎం ఏరియల్ సర్వే

నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించాలని ఆదేశాలు / రహదారులపై రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

అమరావతి, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో పర్యటించి వర్షాలు, తుపాను కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల పరిస్థితిని పరిశీలించారు. కరంచేడు, కొత్తపట్నం, చీరాల, చిలకలూరిపేట, పర్చూరు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్టీజీఎస్‌లో నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్లతో మాట్లాడి రహదారులపై రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, వేలేరుపాడు, పోలవరం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కొన్ని ప్రాంతాల్లో చిన్న నీటిపారుదల చెరువులు పొంగిపొర్లుతున్నాయని ఏలూరు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

కేంద్ర బృందంతో కరువు పరిస్థితులపై సమీక్ష : మరోవైపు రాష్ట్రంలో మిగతా 2లో...

పరీక్షల్లో సమాన న్యాయం

జాతీయ స్థాయిలో అత్యుత్తమ పరీక్షా విధానం రూపొందించాలి / విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలి / నందన్ నీలేకని బృందానికి సీఎం, మంత్రి లోకేష్ సూచనలు 2లో

తుపాన్ల నష్టంపై ప్రధాని ఆరా



- చంద్రబాబుకు మోదీ ఫోన్
- అర్నబ్, మురసు బీభత్సంతో రైతులకు భారీ నష్టం
- కేంద్ర సాయం అందించాలని సీఎం విజ్ఞప్తి
- సహాయక చర్యలను ప్రశంసించిన ప్రధాని

అమరావతి, నవంబర్04 (జర్నలిస్ట్ ఫైల్) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ ఉదయం ఫోన్ చేశారు. వారం రోజుల వ్యవధిలో రాష్ట్రానికి రెండు తుఫాన్ల తాకిడి నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావం... ఆయా ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని సీఎం చంద్రబాబు ప్రధానికి వివరించారు. మిగతా 2లో...

వానలపై నిఘా.. పోలింగ్‌కు పకడ్బందీ

- మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి
- కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల కమిషనర్ సమీక్ష
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత
- సీసీటీవీ, వీడియోగ్రఫీతో నిరంతర పర్యవేక్షణ



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, స్థానిక పరిస్థితులు, మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీ ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ.. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ వర్షాల ప్రభావం, పోలింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, ఎన్నికల సిబ్బంది సంసిద్ధత తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. చాలా జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, పరిమిత సంఖ్యలో కొన్ని ప్రాంతాలు మినహా మిగిలిన చోట్ల పోలింగ్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు మిగతా 2లో...

23న పరోక్ష ఎన్నికలు

100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణ / 18లోగా నోటీసుల జారీకి ఆదేశాలు / అనివార్యమైతే 24న ఎన్నికల ప్రక్రియ పూర్తి

సిఎంఆర్ఎఫ్‌కు విట్ రూ.కోటి విరాళం



- విట్-ఏపీ ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్ అందజేత

అమరావతి, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్) : అర్ణబ్, మురాసు తుపాన్ల బాధితుల సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం విట్-ఏపీ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.కోటి విరాళంగా అందజేశారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి డిమాండ్ డ్రాఫ్ట్‌ను అందించారు.

ఈ సందర్భంగా డాక్టర్ విశ్వనాథన్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాష్ట్ర ప్రజలకు అండగా నిలవడం విట్-ఏపీ విశ్వవిద్యాలయం సామాజిక బాధ్యతగా భావిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు, విపత్తుల సహాయక చర్యలు, సమాజ అభివృద్ధి కార్యక్రమాల్లో విట్ నిరంతరం భాగస్వామ్యమవుతోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విట్-ఏపీ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్లు డాక్టర్ శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, విట్-ఏపీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి పాల్గొన్నారు.

ఉద్యోగాల ముసుగులో ఉచ్చు

- రష్యా సైన్యంలో చేర్చేందుకు ఏజెంట్ల మోసాలు
- అధిక వేతనాలు, మెరుగైన ఉపాధి పేరుతో వల
- యువత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరిక

2లో

వాహన బదిలీలో ఏపీ టాప్

- జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రథమ స్థానం
- ఈవీఓఐ-2026 సూచీలో 15 రాష్ట్రాల్లో అగ్రస్థానం
- రవాణా శాఖ అధికారులకు మంత్రి మండిపల్లి అభినందనలు



2లో

2,721 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రప్రభుత్వం 2,721 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, డిఎస్సి కన్వీనర్ తమీమ్ అన్సారియా బుధవారం విడుదల చేశారు. 2,111 రెగ్యులర్ స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ),సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జిటి) పోస్టులు,350 ప్రత్యేక విద్యా ఉపాధ్యాయ పోస్టులు, వివిధ సొసైటీల పరిధిలో మిగతా 3లో...

రైతులందరికీ పరిహారం

- తుపాను నష్టంపై సమగ్రంగా అంచనాలు
- అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదు
- విద్యుత్ పునరుద్ధరణ పనులు సాయంత్రంలోగా పూర్తి
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ



చిలకలూరిపేట(జర్నలిస్ట్ ఫైల్) : తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి, అర్హులందరికీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేసి నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట పరిసర తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలిసి పర్యటించారు. దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుపాను కారణంగా పంటలకు జరిగిన నష్టాన్ని, ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ఏ ఒక్క రైతుకూ పరిహారం అందకుండా మిగిలిపోకూడదని అధికారులకు స్పష్టం చేశారు.

అనంతరం అద్దంకిలో పర్యటించిన మంత్రి తుపాను ప్రభావం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందస్తు ప్రణాళిక, వివిధ శాఖల సమన్వయంతో పనిచేయడం వల్ల ప్రాణనష్టం జరగకుండా పరిస్థితులను ఎదుర్కోగలిగామని తెలిపారు. తుపాను వచ్చే రెండు రోజుల ముందే విద్యుత్ శాఖ సిబ్బందిని, అవసరమైన సామగ్రిని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మిగతా 3లో...

అన్నదాతను ఆదుకోండి



(మొదటి పేజీ తరువాయి)

గతంలో రాయలసీమలో పది ఎకరాల భూమి ఉన్న రైతులకు సైతం కరువు పరిస్థితుల దృష్ట్యా రేషన్ కార్డులు అందించామని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అర్హులైన కరువు బాధిత కుటుంబాలకు డ్రైట్ కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. దీంతో కేంద్ర సహకారంతో నిత్యావసర సరుకుల ధరలు సబ్సిడీపై అందించే వీలుంటుందని చెప్పారు. అలాగే, రైతులకు రుణాల రీషెడ్యూలింగ్ వంటి ఉపశమన చర్యలు అందేలా కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జేజేఎం విస్తరణతో జల వనరుల బలోపేతం : వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జల మట్టాలు గణనీయంగా పడిపోయాయని ముఖ్యమంత్రి తెలిపారు. అనేక ప్రాంతాల్లో అదనంగా బోర్లు వేసినా ఆశించిన ఫలితం ఉండటం లేదని వివరించారు. అందువల్ల తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో పాటు శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను అభివృద్ధి చేయడం, అనుసంధానించడం వంటి సమర్థ నీటి నిర్వహణ పనులకు కేంద్రం సహకరించాలని కోరారు. కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, పంటల బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా త్వరితగతిన రైతుల ఖాతాల్లో పరిహారం జమయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. రైతులకు సకాలంలో పరిహారం అందితే తదుపరి పంటల సాగుకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుందని వివరించారు. కరువు ప్రభావం వ్యవసాయానికే పరిమితం కాకుండా పశుసంపద, గ్రామీణ జీవనోపాధిపై కూడా పడుతున్నందున పశు గ్రాసం, తాగునీటి సరఫరా వంటి అంశాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

15 రోజుల్లో కేంద్రానికి ఐఎంసీటీ నివేదిక : రాష్ట్రంలోని కరువు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను, రైతుల సమస్యలను పరిశీలించింది. రైతులతో నేరుగా మాట్లాడి పరిస్థితులను తెలుసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాలు, క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని బృందం తెలిపింది. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్రానికి అవసరమైన కేంద్ర సహాయంపై తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

అలాగే రాష్ట్రంలో ఒకవైపు తీవ్ర కరువు పరిస్థితులు నెలకొంటే, మరోవైపు కోస్తాంధ్ర జిల్లాల్లో తుపాను కారణంగా పంటలు, ఇతర రంగాలకు నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ విభిన్న ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం ప్రత్యేకంగా స్పందించి తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

తుపాన్ల నష్టంపై ప్రధాని ఆరా



(మొదటి పేజీ తరువాయి)

భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రైతులకు భారీ నష్టం వాటిల్లిందని సీఎం చెప్పారు. రహదారులు, విద్యుత్ సరఫరా సహా

వివిధ రంగాలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని... ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన సాయం అందించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. తుఫాన్ సహాయక చర్యల్లో రాష్ట్రప్రభుత్వం బాగా పని చేసిందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. నిరంతర అప్రమత్తతతో తుఫాన్ వల్ల వచ్చిన ఇబ్బందులను సమర్థవంతంగా అధిగమించారంటూ సీఎం చంద్రబాబును ప్రధాని ప్రశంసించారు.

23న పరోక్ష ఎన్నికలు

విజయవాడ, నవంబర్ 04 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా 87 మున్సిపాలిటీలు / నగర పంచాయతీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ ను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా విడుదల చేశారు.

ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18వ తేదీ లోపు ఎన్నికల నోటీసు జారీ చేయనున్నారని, అనంతరం 23వ తేదీన పరోక్ష ఎన్నికలు నిర్వహించనున్నారని ఆయన తెలిపారు.

మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో నిర్వహించనున్నారు. ఆయా స్థానిక సంస్థలకు ఎన్నికైన వార్డు సభ్యులు, చైర్‌పర్సన్‌లు, మేయర్ లు ఎన్నికైన ఒక వార్డు సభ్యున్ని డిప్యూటీ మేయర్ గా, వైస్ చైర్‌పర్సన్ గా ఎన్నుకోనున్నారని ఎన్నికల కమిషనర్ పునేఠా తెలిపారు.

ఈ ప్రక్రియలో భాగంగా నిర్ణీత తేదీ లోపు ఎన్నికల నోటీసు జారీ చేసి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత ఎన్నికల అధికారులకు సూచించారు. ఎన్నికల నిబంధనలు, చట్టపరమైన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నికల కమిషనర్ పునేఠా సూచించారు.

ఎన్నికల షెడ్యూల్ వివరాలు: మున్సిపాలిటీలు/నగర పంచాయతీలు: 87, మున్సిపల్ కార్పొరేషన్లు: 13, ఎన్నికల నోటీసు జారీ: 18.11.2026 లోపు, పరోక్ష ఎన్నికల నిర్వహణ: 23.11.2026, ఏదైనా అనివార్య కారణాల వల్ల నవంబర్ 23 వ తేదీన పరోక్ష ఎన్నికలు నిర్వహించకపోతే ఆ ఎన్నికల ప్రక్రియను నవంబర్ 24 తేదీన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు.

మొత్తంగా 100 పట్టణ స్థానిక సంస్థల్లో పరోక్ష ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈ షెడ్యూల్ కీలకంగా మారనుందని ఈ ఎన్నికలతో పట్టణ స్థానిక సంస్థల్లో పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ మరింత ముందుకు సాగనుందని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సహకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పిలుపునిచ్చారు.

తుపాను నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన





(మొదటి పేజీ తరువాయి)

నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులు, వ్యవసాయ నష్టాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కరువు పరిస్థితులను అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం బుధవారం ముఖ్యమంత్రిని కలిసింది. నవంబర్ 2, 3 తేదీల్లో రెండు బృందాలుగా కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించిన అధికారులు క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను సీఎంకు వివరించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఒకవైపు తీరప్రాంత ఆంధ్రప్రదేశ్ తుపాన్ల ప్రభావాన్ని ఎదుర్కొంటుండగా, మరోవైపు రాయలసీమతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలు వర్షాభావం, ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ ఏడాది సాధారణం కంటే గణనీయంగా తక్కువ వర్షపాతం నమోదవడంతో ఖరీఫ్ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. ముఖ్యంగా రాయలసీమలో సాగునీరు, తాగునీరు, పశు గ్రాసం కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన జిల్లాగా అనంతపురం పరిస్థితిని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు.

రాష్ట్రవ్యాప్తంగా 21 జిల్లాల్లోని 388 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించినట్లు సీఎం తెలిపారు. రైతులకు జరిగిన నష్టాలను అంచనా వేసి ఇప్పటికే కేంద్ర సహాయం కోరుతూ నివేదిక సమర్పించామని, మరో వారంలో కరువు పరిస్థితులపై సమగ్ర నివేదికను కేంద్రానికి అందజేస్తామని వెల్లడించారు.

ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలి : ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ఇందుకు క్షేత్రస్థాయిలో పెద్ద సంఖ్యలో మానవ వనరులు అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో VB-G RAM G పథకం కింద కనీస ఉపాధి పనిదినాలను 200 రోజులకు పెంచాలని, వ్యవసాయ కార్యకలాపాలకు కూడా ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు అనుమతించాలని కేంద్ర బృందాన్ని కోరారు. దీనివల్ల వ్యవసాయ కూలీల కొరత తగ్గడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అదనపు ఉపాధి అవకాశాలు కలుగుతాయని వివరించారు.

కరువు కారణంగా రైతుల ఆదాయం గణనీయంగా తగ్గిందని, వ్యవసాయ రుణాలు తిరిగి చెల్లించలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. గతంలో రాయలసీమలో తీవ్ర కరువు పరిస్థితుల దృష్ట్యా పది ఎకరాల భూమి ఉన్న రైతులకు సైతం రేషన్ కార్డులు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అర్హులైన కరువు బాధిత కుటుంబాలకు డ్రై రేషన్ కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. కేంద్ర సహకారంతో రాయితీ ధరలకు నిత్యావసర సరుకులు అందించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ రుణాల రీషెడ్యూల్‌కు సహకరించాలి : భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయని, కొన్ని ప్రాంతాల్లో అదనపు బోర్లు వేసినా ఆశించిన ఫలితాలు రావడం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. తాత్కాలికంగా తాగునీరు సరఫరా చేయడంతో పాటు శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ (JJM) విస్తరణకు కేంద్రం సహకరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానం, సమర్థ నీటి నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు.


కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చంద్రబాబు వివరించారు. పంటల బీమా క్లెయిమ్‌లను ఆలస్యం లేకుండా పరిష్కరించి, పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో త్వరగా జమ చేసేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. సకాలంలో పరిహారం అందితే రైతులు ఆర్థికంగా కోలుకోవడంతో పాటు తదుపరి పంట సాగుకు సిద్ధమవుతారని తెలిపారు.

కరువు ప్రభావం వ్యవసాయంతో పాటు పశుసంపద, గ్రామీణ జీవనోపాధిపైనా పడుతోందని, అందువల్ల పశు గ్రాసం, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ రుణాల రీషెడ్యూల్‌కు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర బృందం కరువు ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాలను పరిశీలించడంతో పాటు రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలు, రాష్ట్ర ప్రభుత్వం అందించిన సమాచారంతో 15 రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని బృంద సభ్యులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్రానికి అందించాల్సిన సహాయంపై తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలు తీవ్ర కరువును ఎదుర్కొంటుండగా, తీరప్రాంత జిల్లాలు తుపాన్ల కారణంగా పంటలు, ఇతర రంగాల్లో నష్టపోయాయని చంద్రబాబు కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఒకేసారి పలు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని తగిన ఆర్థిక, సహాయక చర్యలు అందించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పరీక్షల్లో సమాన న్యాయం

అమరావతి, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్) : విభిన్న రాష్ట్రాలు, భాషలు కలిగిన భారతదేశంలో అందరినీ కలుపుకొని వెళ్లేలా జాతీయ పరీక్షా సంస్కరణలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఏకాభిప్రాయంతో పారదర్శకమైన, విశ్వసనీయమైన జాతీయ పరీక్షా విధానాన్ని రూపొందించాలని అన్నారు. దేశంలోని ఏ ప్రాంతానికి చెందిన విద్యార్థికైనా, ఏ భాష మాట్లాడే విద్యార్థికైనా సమాన అవకాశాలు, న్యాయం జరిగేలా సంస్కరణలు ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఎగ్జామినేషన్ రిఫార్మ్స్ హై పవర్డ్ టాస్క్‌ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ సభ్యులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. సచివాలయానికి వచ్చిన నందన్ నీలేకనికి మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన భేటీలో జాతీయ పరీక్షా విధానంపై టాస్క్‌ఫోర్స్‌కు సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. నేటి తరం విద్యార్థులు, యువత ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరీక్షల విధానం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. కేవలం పరీక్షలు, మార్కులకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా



సామర్థ్యం పెంపొందించేలా విద్యా విధానాన్ని తీర్చిదిద్దాలని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో పాల్గొన్న లోకేష్ ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న విధానాలు, సాంకేతికత వినియోగాన్ని వివరించారు. అలాగే దేశవ్యాప్తంగా పరీక్షల విధానంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై తన ఆలోచనలను పంచుకున్నారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గేలా పరీక్షల విధానాన్ని రూపొందించాలని లోకేష్ సూచించారు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లి చదువుకోవాలన్నా, ఉద్యోగం చేయాలన్నా భాష, విద్యా విధానం, ధృవీకరణల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా జాతీయ స్థాయిలో సమన్వయం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో డేటా లేక్ ద్వారా వివిధ రంగాలకు సంబంధించిన సమాచారాన్ని సమీకరించి, నిర్ణయాలు తీసుకునే వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

పరీక్షల విధానంలో సమూల మార్పుల దిశగా : పరీక్షల నిర్వహణలో పేపర్ లీకేజీలను అరికట్టడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం, సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను పటిష్టం చేయడం, డిజిటల్ ఫోరెన్సిక్స్ విభాగాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై తాము ప్రత్యేక దృష్టి సారించినట్టు టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నామని... ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలు, ఎదురవుతున్న సమస్యలు, సంస్కరణలపై అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు చెప్పారు. ఏపీ అమలు చేస్తున్న విధానాలపై ఆసక్తి వ్యక్తం చేశారు.

వానలపై నిఘా.. పోలింగ్‌కు పకడ్బందీ

(మొదటి పేజీ తరువాయి)

లేవని కలెక్టర్లు నివేదించినట్లు వెల్లడించారు.

వాతావరణ పరిస్థితులు, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్లకు సూచించినట్లు తెలిపారు. ఎక్కడైనా ఎన్నికల నిర్వహణకు ఇబ్బందులు ఎదురైతే క్షేత్రస్థాయి అధికారుల నుంచి వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదికలు తెప్పించుకుని, వాటి ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను ఎన్నికల కమిషనర్ మార్గదర్శకత్వంలో సమర్థవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. అదే తరహాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను కూడా ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి మైక్రో లెవెల్ ప్లానింగ్ రూపొందించామని, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సెక్టార్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ అవసరమైన మార్గదర్శకాలు అందిస్తున్నామని తెలిపారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఒకే దశలో నిర్వహిస్తున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల రద్దీని నియంత్రించడం, క్యూలైన్లను క్రమబద్ధీకరించడం, అవసరమైన చోట తగినంత పోలీసు బలగాలను మోహరించడం కీలకమని తెలిపారు.



పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా బలగాల మోహరింపును చేపట్టి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి డా. ఏ. మల్లిఖార్జున మాట్లాడుతూ..లి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణలో సుమారు 2,52,000 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది కొరత తలెత్తకుండా అవసరమైన సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ కోసం సుమారు 52,000 మంది సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు.

పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఎదురయ్యే రవాణా, ఇతర స్థానిక సమస్యల పరిష్కారంపై కూడా సమీక్షించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వీడియోగ్రఫీని కేవలం బయటకే పరిమితం చేయకుండా, పరిస్థితులను బట్టి లోపల కూడా నిర్వహించాలని సూచించారు. అయితే, ఓటు రహస్యానికి ఎలాంటి భంగం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకున్నప్పుడు సంబంధిత ఘటనకు సంబంధించిన దృశ్యాలను తప్పనిసరిగా రికార్డు చేయాలని ఆదేశించారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద ప్రతి ప్రిసైడింగ్ అధికారికి సంబంధిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా మార్గదర్శకాలు అందించాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ అందుబాటులో లేని ప్రిసైడింగ్ అధికారులకు ఇతర పీవోలు లేదా పోలీసు అధికారుల ఫోన్ల ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల లోపల మాల్‌ప్రాక్టీస్ లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న పక్షంలో ప్రిసైడింగ్ అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా జోనల్ మేజిస్ట్రేట్ లేదా పోలీసు అధికారులను సంప్రదించి పరిస్థితిని వెంటనే అదుపులోకి తీసుకురావాలని సూచించారు.

గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగి సుమారు 2.61 కోట్లకు చేరుకుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు, ఎన్నికల సిబ్బంది ముందస్తు ప్రణాళికతో, క్షేత్రస్థాయిలో సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. మైక్రో లెవెల్ ప్లానింగ్‌తో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,821 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. మిగిలిన 7,770 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ స్థానాల్లో మొత్తం 18,843 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టామని తెలిపారు.

ఉద్యోగాల ముసుగులో ఉచ్చు

అమరావతి, నవంబరు 4 (జర్నలిస్ట్ ఫైల్): రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్న ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలను ప్రభుత్వం హెచ్చరిస్తున్నది. రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో భారతీయ యువతను మోసం చేసి, ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్న ఘటనలు ఆందోళనకరంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరికను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయడమైనది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన యువతను కొన్ని ప్రైవేట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, అక్రమ ఏజెంట్లు ఇతర ఉద్యోగాలు, అధిక వేతనాలు, మెరుగైన ఉపాధి అవకాశాల పేరుతో విదేశాలకు పంపిస్తున్నట్లు సమాచారం అందుతోంది.

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి, యువతను రష్యాకు పంపిన అనంతరం వారిపై ఒత్తిడి తెచ్చి సైన్యంలో చేరేలా చేస్తున్నట్లు, అధిక వేతనాల ఆశ చూపుతున్నట్లు లేదా తప్పుడు కేసుల్లో ఇరికించి బలవంతంగా సైనిక కార్యకలాపాల్లో పాల్గొనేలా చేస్తున్నట్లు పలు ఆందోళనకర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పరిణామాల వల్ల యువత ప్రాణాలకు ముప్పు ఏర్పడటమే కాకుండా, వారి కుటుంబాలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాయి.

ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత, విదేశీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించడమైనది. విదేశీ ఉద్యోగాల పేరుతో ప్రచారం చేసే ఆకర్షణీయమైన ప్రకటనలు, అధిక వేతనాల హామీలు, సులభమైన నియామక ప్రక్రియలు, తక్కువ వ్యవధిలో విదేశాలకు పంపిస్తామనే వాగ్దానాల పట్ల విద్యార్థులు, నిరుద్యోగ యువత మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గుర్తింపు, అనుమతులు లేని ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, అనధికారిక ఏజెంట్ల ద్వారా విదేశీ ఉద్యోగాలకు వెళ్లడం సురక్షితం కాదు. విదేశాలకు వెళ్లే ముందు సంబంధిత ఉద్యోగ ఒప్పందాలు, వీసా వివరాలు, ఉద్యోగ స్వరూపం, నియామక సంస్థల చట్టబద్ధత మరియు విశ్వసనీయతను సంబంధిత అధికారిక సంస్థల ద్వారా తప్పనిసరిగా ధృవీకరించుకోవాలి. ముఖ్యంగా ఉద్యోగాల పేరుతో రష్యా లేదా ఇతర దేశాలకు పంపించి, సైనిక శిక్షణ లేదా సైన్యంలో చేరేలా ఒత్తిడి చేసే మోసపూరిత ప్రయత్నాల పట్ల ప్రత్యేక అప్రమత్తత అవసరం. ఇటువంటి అనుమానాస్పద ఆఫర్లు, ఏజెంట్లు లేదా సంస్థల వివరాలను సంబంధిత ప్రభుత్వ అధికారులకు, పోలీసు శాఖకు తెలియజేయాలి. విదేశీ ఉద్యోగాల కోసం తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, పూర్తి స్థాయి విచారణ మరియు ధృవీకరణ అనంతరమే ముందడుగు వేయాలని యువతకు సూచించడమైనది.

వాహన బదిలీలో ఏపీ టాప్



అమరావతి, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్) : వాహన యాజమాన్య బదిలీ సేవల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈజ్ ఆఫ్ వెహికల్ ఓనర్‌షిప్ ఇండెక్స్ – 2026లో దేశంలోని 15 రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో నిలవడంపై రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఇండియాటెక్.ఆర్గ్, కన్స్యూమర్ వాయిస్ సంస్థలు నవంబర్ 4న న్యూఢిల్లీలో విడుదల చేసిన ఈ సూచీలో ఏపీకి మొదటి స్థానం దక్కడం రాష్ట్ర రవాణా శాఖ చేపట్టిన సంస్కరణలకు గుర్తింపని మంత్రి పేర్కొన్నారు. వాహన యాజమాన్య బదిలీ ప్రక్రియను సులభతరం చేయడం, బయోమెట్రిక్ ప్రీ–ఆథెంటికేషన్ విధానాన్ని అమలు చేయడం, డిజిటల్ సేవలను విస్తరించడం ద్వారా ఈ ఘనత సాధ్యమైందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తోందని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన రవాణా శాఖ అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. భవిష్యత్తులోనూ రవాణా సేవల్లో పారదర్శకత, వేగం, నాణ్యత పెంపునకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

దేశానికే ఆదర్శంగా తిరుమలలోని అనాలసిస్ ల్యాబ్

తిరుపతి,(జర్నలిస్ట్ ఫైల్) : దేశానికే ఆదర్శంగా నిలిచేలా తిరుమలలోని వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్ అభివృద్ధి చేస్తామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య నాయుడు అన్నారు. తిరుమలలోని వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్?లో జరిగిన ఆయుధపూజలో పాల్గొన్న ఆయన లాబ్?లోని పరికరాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్చి 21న ప్రారంభించిన ఈ ఫుడ్ అండ్ వాటర్ అనాలసిస్ ల్యాబొరేటరీని ఎఫ్ఎస్ఎస్ఏఐ సహకారంతో కేవలం 11 నెలల్లోనే అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేశామన్నారు.

2,500 ఆహార నమూనాలను సేకరించి పరీక్షలు : దేశంలోని ఇతర ఆలయాలు, దేవాదాయ సంస్థల్లో లేని విధంగా అత్యున్నత ప్రమాణాలతో ఈ ల్యాబ్‌ను నిర్మించామని అదనపు ఈవో తెలిపారు.



తుఫాను బాధిత రైతులకు అండగా ఉంటాం









● పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా కృషి ● మున్నంగిలో దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

● రైతులకు భరోసా ఇచ్చిన కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): అర్నబ్ తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులకు అండగా నిలుస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ భరోసా ఇచ్చారు. కొల్లిపర మండలం మున్నంగి గ్రామంలో తుఫాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నష్టంతో ఆందోళన చెందుతున్నరైతులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.

తుఫాను ప్రభావంతో దెబ్బతిన్నపంటలను పరిశీలించిన వారునష్టం తీవ్రతను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట సాగుకు చేసిన పెట్టుబడులు, ప్రస్తుతం పంటల పరిస్థితి, దిగుబడిపై ప్రభావం, ఆర్థికంగా ఎదురైన నష్టాల గురించి వివరాలు సేకరించారు. పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు దెబ్బతినడంతో కుటుంబ పోషణ, రుణాల చెల్లింపుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు నష్టం వాటిల్లినప్పుడు ప్రభుత్వం వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. మున్నంగి గ్రామంతో పాటు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని సంబంధిత అధికారులతో మాట్లాడతామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి, నష్ట వివరాలను ప్రభుత్వానికి నివేదించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పంట నష్టపరిహారం అందించే విషయంలో అధికారుల అంచనాలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకునేలా చూస్తామని చెప్పారు. రైతులు అధైర్యపడవద్దని, కష్టకాలంలో ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతులు బాగుంటేనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట పొలాలను పరిశీలించినట్లు తెలిపారు. తుఫాను కారణంగా జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధిత రైతులకు తగిన సహాయం అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు రైతుల శ్రమను, పెట్టుబడులను దెబ్బతీసినప్పటికీ వారు తిరిగి వ్యవసాయం చేసుకునేలా అవసరమైన సహకారం అందించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు, గ్రామస్థులు, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

2,721 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

260 ప్రిన్సిపాల్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్, ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు ఉన్నాయి. ఈ నెల 11 నుంచి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో పరీక్ష జరగనుందని పేర్కొన్నారు. దరఖాస్తుల సమర్పణ విధానం, ఫీజు చెల్లింపు, దరఖాస్తుల చివర తేదీల వంటి సమగ్ర వివరాలను ్ఠవ్ఠ2ఎంఎ.ఖజూఎటంం.అఅ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

రైతులందరికీ పరిహారం



(మొదటి పేజీ తరువాయి)

మూడు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టం : తుపాను కారణంగా ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గత రెండు రోజులుగా విద్యుత్ అంతరాయాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి రెండు వేల మందికిపైగా విద్యుత్ సిబ్బంది వచ్చిక్షేత్రస్థాయిలో మరమ్మతు పనులు చేపడుతున్నారని తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ నుంచి మరో వెయ్యి మంది సిబ్బందిని ప్రకాశం, పల్నాడు జిల్లాలకు పంపించినట్లు పేర్కొన్నారు.

సీఎండీ నుంచి లైన్‌మెన్ వరకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తూ విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేస్తున్నారని చెప్పారు. తెగిపడిన విద్యుత్ తీగలు, దెబ్బతిన్నట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. బుధవారం సాయంత్రంలోగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. మరమ్మతుల సమయంలో విద్యుత్ సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాలకు అదనపు సిబ్బంది, సామగ్రిని పంపించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

బాపట్ల జిల్లాలోనూ తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన : అనంతరం బాపట్ల జిల్లాలోని పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షించారు. కర్ణాటకలోని గుల్బర్గా నుంచి వచ్చిన విద్యుత్ సిబ్బందిని కలిసి వారి సేవలను అభినందించారు. చీరాలలో తమిళనాడు నుంచి వచ్చిన సిబ్బంది చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించి వారితో మాట్లాడారు.

తుపాను వంటి క్లిష్ట పరిస్థితుల్లో సొంత ప్రాంతాలను విడిచి వచ్చి ప్రజలకు విద్యుత్ సేవలు అందిస్తున్న సిబ్బంది సేవలు అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. వారి కృషికి కృతజ్ఞతలు తెలిపారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులకు అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ పర్యటనలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణ విజయోత్సాహంతో పరిషత్ ఎన్నికలకు సిద్ధం కావాలి!

- **జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కూటమి ఘన విజయం సాధించాలి**
- **94 శాతం స్ట్రైక్‌రేట్‌ను మించి స్థానాలు గెలవాలి**
- **అన్ని జెడ్పీ, ఎంపీపీ స్థానాలూ కూటమి ఖాతాలోకి రావాలి**
- **పొత్తు ధర్మం పాటించని వారికి పార్టీలో స్థానం లేదు: చంద్రబాబు**



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయోత్సాహంతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకూ కూటమి శ్రేణులు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. పట్టణ ఎన్నికల్లో సాధించిన 94 శాతం స్ట్రైక్‌రేట్‌ను మించి పరిషత్ ఎన్నికల్లో స్థానాలు కైవసం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్ అధ్యక్ష స్థానాలనూ కూటమి ఖాతాలో వేసుకునేలా సమష్టిగా పనిచేయాలని సూచించారు. పొత్తు ధర్మాన్ని ఉల్లంఘించే వారికి పార్టీలో స్థానం ఉండదని స్పష్టం చేశారు.

కూటమి పార్టీల ముఖ్య నేతలు, కార్యకర్తలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. రెండున్నరేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పునకు ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. ప్రజలకు మంచి చేస్తే అన్ని స్థాయుల్లోనూ మద్దతుగా నిలుస్తారని ఎన్నికల ఫలితాలు నిరూపించాయన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. డీఎస్సీతో పాటు జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాల భర్తీ చేపడుతున్నట్లు తెలిపారు.

కొన్ని ప్రాంతాల్లో స్థానిక సమన్వయ లోపాల కారణంగా సీట్లు కోల్పోయామని, ఓడిపోయిన స్థానాల్లోనూ కూటమి రెబల్ అభ్యర్థులు గెలిచిన సందర్భాలున్నాయని పేర్కొన్నారు. మిత్రపక్షాల మధ్య ఐక్యత దెబ్బతినకూడదని, ఏ పార్టీ అభ్యర్థి బరిలో ఉన్నా కూటమి అభ్యర్థిగానే భావించి విజయానికి కృషి చేయాలని సూచించారు.

నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేస్తాం : స్థానిక ఎన్నికల్లో సీట్లు ఆశించి అవకాశం దక్కించుకోలేని కూటమి నేతలకు నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పొత్తు ధర్మాన్ని ఉల్లంఘించే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. సుపరిపాలనతో పాటు రాజకీయ సమన్వయానికి కూడా ప్రాధాన్యమిస్తున్నామని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ హింసను ప్రేరేపిస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఓటమి తప్పదనే భయంతోనే ఇలాంటి చర్యలకు దిగుతోందని, స్థానిక ఎన్నికల్లో ప్రజలు మరోసారి ఆ పార్టీకి గుణపాఠం చెప్పారని అన్నారు.రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిషత్ ఎన్నికల పోలింగ్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల నిర్వహణపై ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో చర్చించింది. అన్ని జిల్లాల్లో వర్షాల పరిస్థితులు, పోలింగ్ ఏర్పాట్లపై వివరాలు తెలుసుకుంది. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికకు పోలింగ్ యథావిధిగా నిర్వహించాలని నిర్ణయించింది.

1,271 మంది ఉద్యోగులకు కాన్వా ఉద్వాసన

ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : ప్రముఖ డిజైన్ ప్లాట్‌ఫామ్ కాన్వా సంస్థ సంచలన నిర్ణయం తీసుకుంది. సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా మొత్తం ఉద్యోగుల్లో 22 శాతం మందికి, అంటే 1,271 మందికి ఉద్వాసన పలికింది. సంస్థ 13 ఏళ్ల చరిత్రలోనే ఇది అత్యంత కఠిన నిర్ణయమని సహ వ్యవస్థాపకురాలు, సీఈఓ మెలానీ పెర్కిన్స్ పేర్కొన్నారు.ఉద్యోగుల తొలగింపుపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఆమె రాసిన భావోద్వేగ లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నిర్ణయం ఉద్యోగుల ప్రతిభకు, పనితీరుకు సంబంధించింది కాదని, వారి కృషి, సృజనాత్మకత సంస్థ ఎదుగుదలకు ఎంతో దోహదపడ్డాయని ఆమె పేర్కొన్నారు.

ఉద్యోగాలు కోల్పోయిన వారికి కనీసం ఆరు నెలల వేతనం, సాధ్యమైన చోట ఏడాది పాటు ఆరోగ్య బీమా, కెరీర్ కోచింగ్, కౌన్సెలింగ్ వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా సొంత వ్యాపారాలు, సామాజిక ప్రాజెక్టులు ప్రారంభించాలనుకునే వారికి సుమారు రూ.8.3 లక్షల గ్రాంట్ అందించేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశారు.

సాధారణ లే-ఆఫ్ ప్రకటనలకు భిన్నంగా ఉద్యోగుల పట్ల సానుభూతి, బాధ్యతను ప్రతిబింబించేలా సీఈఓ లేఖ ఉందంటూ లింక్డ్‌ఇన్‌లో పలువురు ప్రశంసిస్తున్నారు. ఉద్యోగాల కోతతో పాటు బాధితులకు అండగా నిలిచేందుకు తీసుకున్న చర్యలు టెక్ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి.

కాన్వా సీఈవో లేఖ లింక్డ్‌ఇన్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. సాధారణంగా కంపెనీలు ఇచ్చే రూటిన్ లే-ఆఫ్ ప్రకటనలతో పోలిస్తే ఈ లేఖ ఉన్న తీరు చాలా భిన్నంగా ఉందని కొంతమంది యూజర్లు కొనియాడారు. కాన్వా మహిళా వ్యవస్థాపకురాలి నుండి వచ్చిన ఈ మాస్ లే-ఆఫ్ మెమో టోన్ సాధారణంగా మనం చూసే లే-ఆఫ్ మెమోల కంటే చాలా భిన్నంగా ఉంది. దీనిని నేను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను" అని ఒక యూజర్ రాశారు. తీసుకోవాల్సినంత కఠినమైన నిర్ణయాన్ని నిజంగా అంతే బాధ్యతతో తీసుకున్నట్లు అనిపిస్తోంది. ఇతర కంపెనీలు కూడా దీనిని గమనిస్తాయని ఆశిస్తున్నా అని మరొకరు కమెంట్ చేశారు.

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల ప్రభంజనం

వాషింగ్టన్:అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ ఘన విజయం సాధించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఓటర్లు గట్టి షాక్ ఇచ్చారు. ప్రతినిధుల సభ (హౌస్), సెనేట్ రెండింటిలోనూ డెమోక్రాట్లు ఆధిక్యం సాధించి రిపబ్లికన్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలించారు. దీంతో ట్రంప్ రెండో పదవీకాలంలోని చివరి రెండేళ్లలో ఆయన విధానాలకు అడ్డుకట్ట వేసే అవకాశం డెమోక్రాట్లకు లభించింది. ప్రభుత్వ నిర్ణయాలు, అవినీతి ఆరోపణలు, ఇరాన్‌పై యుద్ధం వంటి అంశాలపై కాంగ్రెస్ కమిటీల ద్వారా విచారణ జరిపించే అధికారమూ వారికి దక్కనుంది.

ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు ఎన్నికలు జరగ్గా, మెజారిటీకి అవసరమైన 218 స్థానాల మార్కును డెమోక్రాట్లు అధిగమించారు. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం ఆ పార్టీ 228 స్థానాలను కైవసం చేసుకోగా, రిపబ్లికన్లు 139 స్థానాలకే పరిమితమయ్యారు. దీంతో హకీమ్ జెఫ్రీస్ తదుపరి హౌస్ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశముంది.

మరోవైపు సెనేట్‌లోని 100 స్థానాలకు గాను మంగళవారం 35 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో డెమోక్రాట్లు 20 స్థానాలు గెలుచుకున్నారు. గతంలో ఉన్న స్థానాలతో కలిపి సెనేట్‌లో వారి బలం 54కు చేరింది. రిపబ్లికన్లు 13 స్థానాలకే పరిమితమయ్యారు. దీంతో ట్రంప్ ప్రభుత్వానికి చట్టాల ఆమోదం, కీలక నియామకాల విషయంలో ఇబ్బందులు ఎదురుకానున్నాయి.

అమెరికాలో పెరిగిన జీవన వ్యయాలు, దిగుమతులపై ట్రంప్ విధించిన సుంకాలు, ఇరాన్‌తో యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరగడం వంటి అంశాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ ప్రజాదరణ రేటింగ్ పడిపోతున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు ఆయన రెండో పదవీకాల పాలనపై ప్రజాభిప్రాయానికి అద్దం పట్టాయని పేర్కొంటున్నారు.



అద్దెలు, నిత్యావసర వస్తువులు, విద్యుత్తు బిల్లులు, ఆస్తి పన్నులు పెరుగుతుండటంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమైంది. సాధారణ ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించే నాయకత్వం కాంగ్రెస్‌లో ఉండాలని కోరుకుంటున్నట్లు లాస్ ఏంజెలెస్‌కు చెందిన ఓ యువ ఓటరు పేర్కొన్నారు. ఈ అసంతృప్తే డెమోక్రాట్లకు కలిసొచ్చినట్లు తెలుస్తోంది.

ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ సోషలిస్టులు కూడా సత్తా చాటారు. డెమోక్రటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికా (డీఎస్ఏ) మద్దతున్న అభ్యర్థులు పలు కీలక స్థానాల్లో విజయం సాధించారు. హౌస్‌కు డెమోక్రటిక్ పార్టీ తరపున పోటీ చేసిన ఐదుగురు కొత్త సోషలిస్టు అభ్యర్థులు గెలుపొందారు.

న్యూయార్క్ నుంచి క్లైర్ వాల్డెజ్, దరియాలిజా అవిలా చేవాలియర్, పెన్సిల్వేనియా నుంచి క్రిస్ రాబ్, మిచిగన్ నుంచి డొనవాన్ మెక్కిన్నీ విజయం సాధించారు. కొలరాడోలో సీనియర్ డెమోక్రాట్ నేతను ఓడించిన మెలాట్ కిరోస్ గెలుపు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వీరంతా ఇప్పటికే కాంగ్రెస్‌లో ఉన్న అలెగ్జాండ్రియా ఒకేసియో-కోర్టెజ్, రషీదా త్లైబ్‌లతో కలిసి పనిచేయనున్నారు.

మేయర్ ఎన్నికల్లోనూ సోషలిస్టులు విజయాలు నమోదు చేశారు. వాషింగ్టన్ డీసీ మేయర్‌గా జానీస్ లూయిస్ జార్జ్ గెలుపొందారు. రోడ్ ఐలాండ్‌లోని ప్రావిడెన్స్ మేయర్‌గా డేవిడ్ మోరల్స్ విజయం సాధించారు. లాస్ ఏంజెలెస్ మేయర్ రేసులో నిత్యా రామన్ ఫలితంపై ఉత్కంఠ కొనసాగుతోంది. గృహ నిర్మాణం, వైద్యం, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకోవడం వల్లే సోషలిస్టు అభ్యర్థులకు మద్దతు పెరిగిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నికల ఫలితాలపై ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందించారు. "నేను ఎన్నికల బరిలో లేను. ఒకవేళ పోటీ చేసి ఉంటే భారీ మెజారిటీతో గెలిచేవాడిని" అని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ డెమోక్రాట్లు తీసుకొచ్చే ప్రతిపాదనలను వీటో చేస్తానని వ్యాఖ్యానించినప్పటికీ, కొన్ని అంశాల్లో వారితో ఒప్పందాలకు అవకాశం ఉందని అంగీకరించారు.

రిపబ్లికన్లకు దశాబ్దాలుగా పట్టున్న ప్రాంతాల్లోనూ డెమోక్రాట్లు విజయాలు సాధించారు. టెక్సాస్‌లో 38 ఏళ్లుగా కొనసాగుతున్న రిపబ్లికన్ల ఆధిపత్యానికి 37 ఏళ్ల జేమ్స్ తలారికో గండికొట్టారు. ట్రంప్ ప్రధాన అనుచరుడైన కెన్ పాక్స్‌టన్‌పై సెనేట్ స్థానంలో విజయం సాధించి సంచలనం సృష్టించారు.

కన్సాస్‌లోనూ రిపబ్లికన్లకు ఎదురుదెబ్బ తగిలింది. ఆ రాష్ట్రంలో ఆడమ్ హామిల్టన్ సీనియర్ రిపబ్లికన్ నేత రోజర్ మార్షల్‌ను ఓడించారు. సౌత్ కరోలినాలో డెమోక్రాట్ అభ్యర్థి, చిన్నారుల వైద్యురాలు ఆనీ ఆండ్రూస్ ట్రంప్ మద్దతున్న డార్లిన్ గ్రాహమ్‌పై విజయం సాధించారు. 1998 తర్వాత ఆ రాష్ట్రంలో డెమోక్రాట్లు సెనేట్ ఎన్నికల్లో గెలవడం ఇదే తొలిసారి. నార్త్ కరోలినాలో మాజీ గవర్నర్ రాయ్ కూపర్ ట్రంప్ ఎంపిక చేసిన అభ్యర్థిని ఓడించారు. జార్జియాలో జాన్ ఆసాఫ్ తిరిగి ఎన్నికయ్యారు. న్యూ హాంప్‌షైర్‌లో క్రిస్ పపాస్ గెలుపొందారు. ఫ్లోరిడాలో మాత్రం రిపబ్లికన్ అభ్యర్థి ఆష్లీ మూడీ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు.

జర్నలిస్ట్ ఫైల్ JOURNALIST FILE
సంపాదక స్వరం EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

- కూటమి బలమే.. విజయానికి అసలైన బాట
- క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా పనిచేసిన కూటమి పార్టీల శ్రేణులు..
- స్థానిక ఎన్నికల ఫలితాలతో మరోసారి స్పష్టమైన ఐక్యత



మోదీ-చంద్రబాబు-పవన్ సమన్వయానికి ప్రజామోదం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి మరోసారి తన రాజకీయ బలాన్ని చాటుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి, తాజాగా జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మెరుగైన ఫలితాలను నమోదు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విజయాల వెనుక కేవలం అధికార బలం మాత్రమే కాకుండా, మూడు పార్టీల మధ్య కొనసాగిన నాయకత్వ సమన్వయం, పరస్పర సహకారం, ఓట్ల బదిలీ, క్షేత్రస్థాయి కార్యకర్తల సమష్టి కృషి కీలక పాత్ర పోషించాయని విశ్లేషించవచ్చు.

కూటమి రాజకీయాల్లో పార్టీల మధ్య అవగాహన కుదుర్చుకోవడం ఒక ఎత్తయితే, ఆ అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేయడం మరో ఎత్తు. సీట్ల కేటాయింపు దగ్గర నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు అనేక సవాళ్లు ఎదురవుతాయి. ఒక్కో పార్టీకి ఒక్కో ప్రాంతంలో బలమైన నాయకులు, ఆశావహులు ఉంటారు. తమకు ప్రాధాన్యం దక్కలేదనే అసంతృప్తులు కూడా సహజం. అయినప్పటికీ ఉమ్మడి లక్ష్యం కోసం వ్యక్తిగత, పార్టీ ప్రయోజనాలను పక్కనపెట్టి పనిచేయడం కూటమి విజయానికి అవసరం. తాజా ఎన్నికల్లో ఈ విషయంలో కూటమి నాయకత్వం కొంతవరకు విజయవంతమైందని ఫలితాలు సూచిస్తున్నాయి.

ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మధ్య కొనసాగుతున్న రాజకీయ సమన్వయం కూటమికి ప్రధాన బలంగా నిలుస్తోంది. బీజేపీ రాష్ట్ర నాయకత్వంతోనూ సంప్రదింపులు కొనసాగిస్తూ ఉమ్మడి కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వడం గమనార్హం. అగ్ర నాయకత్వం మధ్య ఉన్న అవగాహన కేవలం సమావేశాలు, ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలోని నాయకులు, కార్యకర్తల వరకు చేరినప్పుడే ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. తాజా ఎన్నికల ఫలితాలు ఈ దిశగా కూటమి సాధించిన పురోగతిని ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా ఓట్ల బదిలీ అంశం ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. ఒక పార్టీకి చెందిన అభ్యర్థి పోటీ చేసినప్పుడు మిగిలిన భాగస్వామ్య పార్టీల ఓటర్లు కూడా ఆ అభ్యర్థికి మద్దతు ఇవ్వడం కూటమి రాజకీయాల్లో అత్యంత ముఖ్యం. కేవలం అగ్ర నాయకులు ఒకే వేదికపై కనిపించినంత మాత్రాన కూటమి బలపడదు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు పరస్పరం సహకరించుకోవాలి. ఓటర్లు ఉమ్మడి అభ్యర్థిని తమ అభ్యర్థిగా భావించాలి. ఈ ఎన్నికల్లో పలు ప్రాంతాల్లో కనిపించిన ఫలితాలు కూటమి మధ్య ఓట్ల బదిలీ మెరుగుపడిందనే అభిప్రాయానికి బలం చేకూరుస్తున్నాయి. అయితే ఈ ఐక్యతను శాశ్వతంగా కొనసాగించడం అంత సులభం కాదు. అధికారంలో ఉన్నప్పుడు పార్టీల మధ్య స్థానిక ఆధిపత్య పోరు, పదవుల పంపకం, అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యం, నియోజకవర్గ స్థాయి రాజకీయ ప్రయోజనాల విషయంలో విభేదాలు తలెత్తే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో నాయకత్వం సమయానుకూలంగా జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలి. కూటమి ధర్మం అంటే ఎన్నికల సమయంలో మాత్రమే పరస్పరం మద్దతు ఇవ్వడం కాదు.. అధికారంలోనూ భాగస్వామ్య పార్టీలకు గౌరవం, సముచిత ప్రాధాన్యం కల్పించడం.

మరోవైపు ఈ విజయాలను చూసి కూటమి నాయకులు అతివిశ్వాసానికి లోనుకాకూడదు. ప్రజలు ఇచ్చిన తీర్పు మరింత బాధ్యతను పెంచుతుంది. పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై ఎన్నికైన ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి. కూటమి ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలి. స్థానిక సంస్థలను రాజకీయ వేదికలుగా కాకుండా ప్రజాసేవా కేంద్రాలుగా తీర్చిదిద్దాలి.

ప్రతిపక్ష వైఎస్సార్సీపీకి కూడా ఈ ఫలితాలు ఆత్మపరిశీలనకు అవకాశం కల్పిస్తున్నాయి. కూటమి ఐక్యతను తక్కువ అంచనా వేయడం కంటే, ప్రజల్లో తమపై విశ్వాసం ఎందుకు తగ్గిందో విశ్లేషించుకోవడం అవసరం. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం కూడా పాలకపక్షానికి ఎంత అవసరమో, ప్రజల సమస్యలను సమర్థంగా ప్రస్తావించే ప్రతిపక్షం అంతే అవసరం. ముందున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలు కూటమి ఐక్యతకు మరో పరీక్షగా నిలవనున్నాయి. పట్టణ ప్రాంతాల్లో సాధించిన విజయాన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ పునరావృతం చేయాలంటే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు రూపొందించాలి. గ్రామస్థాయి నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పార్టీల మధ్య సమన్వయాన్ని నిరంతరం కొనసాగించాలి. కేవలం ఎన్నికల గణాంకాలపై కాకుండా పాలనలో సాధించే ఫలితాలపై దృష్టి పెట్టాలి. రాజకీయాల్లో కూటములు ఏర్పడటం సహజం. కానీ వాటిని నిలబెట్టుకోవడం నాయకత్వ పటిమకు అసలైన పరీక్ష. చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర నాయకత్వం మధ్య కొనసాగుతున్న సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ, క్షేత్రస్థాయి కార్యకర్తల ఐక్యతను కాపాడుకుంటే కూటమికి దీర్ఘకాలిక రాజకీయ ప్రయోజనం ఉంటుంది. అంతిమంగా ఎన్నికల్లో గెలుపు కంటే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే ముఖ్యం. ఆ విశ్వాసాన్ని అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన ద్వారా నిరూపించుకున్నప్పుడే కూటమి విజయానికి నిజమైన సార్థకత చేకూరుతుంది.

పులివెందుల కోటలో మార్పు పవనాలు !



- దశాబ్దాల రాజకీయ ఆధిపత్యానికి ప్రజల తీర్పుతో ఎదురుదెబ్బ
- కుటుంబ రాజకీయాలకు అతీతంగా మారుతున్న ఓటరు ఆలోచన..
- ప్రజాభిమానమే శాశ్వత రాజకీయ బలం

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో పులివెందులకు ప్రత్యేక స్థానం ఉంది. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరకు ఆ కుటుంబానికి రాజకీయంగా తిరుగులేని పట్టున్న ప్రాంతమిది. దశాబ్దాలుగా వైఎస్ కుటుంబానికి కంచుకోటగా కొనసాగిన పులివెందులలో ఇప్పుడు రాజకీయ సమీకరణాలు మారాయి. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆ ప్రాంత రాజకీయ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచాయి. కుటుంబ రాజకీయ ఆధిపత్యానికి ప్రజల తీర్పు ద్వారా ఎదురైన ఈ సవాలు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

పులివెందుల మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత తొలిసారిగా తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి విజయం సాధించడం సాధారణ రాజకీయ పరిణామం కాదు. మొత్తం 40 వార్డుల్లో కూటమి అభ్యర్థులు 37 స్థానాలను గెలుచుకోగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం మూడు వార్డులకే పరిమితమైంది. కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి తుగుట్ల గీతాకుమారి, వైఎస్సార్సీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మపై 13,875 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఈ ఫలితం పులివెందులలో రాజకీయ ఆధిపత్యం మారుతున్నదనే సంకేతాన్ని ఇచ్చింది.

ఒకప్పుడు ప్రత్యర్థి పార్టీలు బలమైన పోటీ ఇవ్వడానికి కూడా ఆలోచించే స్థాయిలో వైఎస్ కుటుంబానికి పట్టున్న ప్రాంతంలో కూటమి ఇంతటి విజయాన్ని నమోదు చేయడం వెనుక అనేక రాజకీయ, సామాజిక కారణాలు ఉండవచ్చు. స్థానిక సమస్యలు, అభివృద్ధిపై ప్రజల అంచనాలు, పాలకుల పనితీరు, నాయకత్వంపై విశ్వాసం, స్థానిక నేతల ప్రజాసంబంధాలు వంటి అంశాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఈ విజయాన్ని కేవలం ఒక పార్టీ గెలుపుగా మాత్రమే కాకుండా, స్థానిక ప్రజాభిప్రాయంలో చోటుచేసుకున్న మార్పుగా విశ్లేషించాలి.

రాజకీయాల్లో వారసత్వం ఒక నాయకుడికి గుర్తింపును ఇవ్వవచ్చు. కుటుంబ నేపథ్యం ఆరంభంలో ప్రజాదరణను కూడా తెచ్చిపెట్టవచ్చు. కానీ ఆ ఆదరణను నిలబెట్టుకోవాలంటే నిరంతరం ప్రజల మధ్య ఉండాలి. వారి సమస్యలను గుర్తించాలి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి. ఒక ప్రాంతాన్ని దశాబ్దాలుగా ప్రభావితం చేసిన రాజకీయ కుటుంబమైనా, ప్రజల తీర్పుకు అతీతం కాదు. పులివెందుల ఫలితం ఈ ప్రజాస్వామ్య సత్యాన్ని మరోసారి గుర్తుచేస్తోంది.


అయితే ఈ ఎన్నికల ప్రక్రియపై వైఎస్సార్సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పోలింగ్ ఏజెంట్లను అడ్డుకున్నారని, ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ రీపోలింగ్ కోరారు. మరోవైపు ఎన్నికల ప్రక్రియ నిబంధనల ప్రకారమే జరిగిందని అధికార పక్షం వాదించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై వచ్చిన ఆరోపణలు, వాటికి సంబంధించిన ఫిర్యాదులు, అధికారుల నిర్ణయాలు నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలతోపాటు ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం ఉండటం కూడా అంతే ముఖ్యం.

ఈ ఫలితాన్ని వైఎస్సార్సీపీ కేవలం ప్రత్యర్థి పార్టీ విజయంగా కొట్టిపారేయడం రాజకీయంగా సరైన విధానం కాదు. సొంతంగా బలమైన పునాదులున్న ప్రాంతంలో ఇంతటి ఓటమి ఎందుకు ఎదురైందన్న అంశంపై ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. స్థానిక నాయకత్వం, కార్యకర్తలతో సంబంధాలు, ప్రజా సమస్యలపై స్పందన, క్షేత్రస్థాయి రాజకీయ వ్యూహం వంటి అంశాలను సమీక్షించుకోవాలి. అదే సమయంలో విజయం సాధించిన కూటమి కూడా ఈ ఫలితాన్ని శాశ్వత రాజకీయ ఆధిపత్యానికి ధ్రువీకరణగా భావించకూడదు.

ప్రజలు ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా స్వీకరించి పులివెందుల అభివృద్ధికి కృషి చేయాలి. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టాలి. రాజకీయ ప్రత్యర్థులపై ఆధిపత్యం ప్రదర్శించడం కంటే ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఎన్నికైన ప్రతినిధుల ప్రథమ కర్తవ్యం కావాలి.

పులివెందుల ఫలితం ఒక రాజకీయ కుటుంబానికి ఎదురైన ఓటమి మాత్రమే కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలనే విషయానికి మరో ఉదాహరణ. రాజకీయ కోటలు ఎంత బలంగా ఉన్నా ప్రజల విశ్వాసం సడలితే వాటి పునాదులు కదులుతాయి. అదే విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే సేవ, సమర్థత, జవాబుదారీతనం తప్పనిసరి. ఎన్నికల్లో గెలుపు ఒక అవకాశం మాత్రమే.. ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవడమే అసలైన విజయం.

ముఖ్యమంత్రులు విమర్శలకు అతీతులు కారు !



పాగడ్తలే కాదు.. విమర్శలూ వినాలి

పాలకులారా.. విమర్శలను స్వాగతించండి

ప్రజలను ప్రశ్నించే హక్కు ఎంత ముఖ్యమో..

పాలకులను ప్రశ్నించే హక్కూ అంతే ముఖ్యం

భావప్రకటనా స్వేచ్ఛకు రాజ్యాంగ రక్షణ ఉందని స్పష్టం చేసిన మద్రాస్ హైకోర్టు

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు నిర్వహించడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం మాత్రమే కాదు. ప్రజలకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉండాలి. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలి. పాలకుల పనితీరుపై విమర్శలు చేయాలి. తప్పులను ఎత్తిచూపాలి. అటువంటి విమర్శలను సహనంతో స్వీకరించి, అవసరమైతే సరిదిద్దుకోవడం పాలకుల బాధ్యత. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారంలో ఉన్నవారికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో, వారిని ప్రశ్నించే పౌరులకు కూడా అంతే ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్యమంత్రులను విమర్శించే హక్కు పౌరులకు ఉందంటూ మద్రాస్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి గుర్తుచేశాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌పై విమర్శలు చేసిన డీఎంకే కౌన్సిలర్ సుధపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం, పాలకులను ప్రశ్నించడం, విమర్శించడం, తమ వ్యతిరేకతను వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో పౌరులకు ఉన్న హక్కులని స్పష్టం చేసింది. ముఖ్యమంత్రిని ఎన్నుకునే హక్కు ప్రజలకు ఉన్నట్లే, ఆయన పనితీరును విమర్శించే హక్కు కూడా ఉంటుందని పేర్కొంది. ఈ వ్యాఖ్యలు కేవలం ఒక రాష్ట్రానికి, ఒక రాజకీయ పార్టీకి లేదా ఒక ముఖ్యమంత్రికి సంబంధించినవి కావు. దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థకు వర్తించే విస్తృతమైన రాజ్యాంగ సూత్రాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అధికారంలో ఎవరున్నా ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందిన నాయకులు ఐదేళ్లపాటు పాలించే అధికారం పొందుతారు. కానీ ఆ అధికారం ప్రజలపై ప్రశ్నించరాని ఆధిపత్యాన్ని ఇవ్వదు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యతను మరింత పెంచుతుంది.

భారత రాజ్యాంగంలోని అధికరణ 19(1)(ఎ) భావప్రకటనా స్వేచ్ఛకు హామీ ఇస్తుంది. ప్రభుత్వ నిర్ణయాలపై అభిప్రాయాలు వ్యక్తం చేయడం, ప్రజా సమస్యలపై స్పందించడం, రాజకీయ నాయకుల పనితీరును విమర్శించడం ఈ స్వేచ్ఛలో భాగం. అయితే ఈ హక్కుకు రాజ్యాంగం నిర్దేశించిన సహేతుకమైన పరిమితులు కూడా ఉన్నాయి. పరువు నష్టం, హింసకు ప్రేరేపించడం, ఇతర చట్టవిరుద్ధ చర్యలను భావప్రకటనా స్వేచ్ఛ పేరుతో సమర్థించలేం. విధానపరమైన విమర్శలను వ్యక్తిగత దూషణలతో కలిపి చూడకూడదు. ప్రస్తుతం సోషల్ మీడియా విస్తరణతో ప్రతి పౌరుడికీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే వేదిక లభించింది. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజలు వెంటనే స్పందిస్తున్నారు. ప్రజాప్రతినిధుల పనితీరుపై ప్రశ్నలు సంధిస్తున్నారు. ఈ పరిణామాన్ని ప్రజాస్వామ్య బలంగా చూడాలి. విమర్శలు వచ్చినప్పుడు వాటి వెనుక ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి పాలకులు ప్రయత్నించాలి. విమర్శకులపై కేసులు పెట్టడం, పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించి భయపెట్టడం వంటి చర్యలు ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి.

పోలీసు వ్యవస్థ కూడా ఈ విషయంలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అధికారంలో ఉన్నవారి ప్రయోజనాల కోసం కాకుండా చట్టం ప్రకారం నిష్పక్షపాతంగా పనిచేయాలి. రాజకీయ విమర్శలు, వ్యక్తిగత కక్షలు, నిజమైన నేరపూరిత చర్యల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాలి. ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడటం ప్రభుత్వంతోపాటు పోలీసు వ్యవస్థ బాధ్యత కూడా.న్యాయవ్యవస్థ ఇటువంటి సందర్భాల్లో రాజ్యాంగ విలువలను గుర్తుచేయడం ప్రజాస్వామ్యానికి అవసరం. మెజారిటీ బలం ఉన్న ప్రభుత్వమైనా రాజ్యాంగానికి లోబడి పనిచేయాల్సిందే. ప్రజాస్వామ్యంలో అధికార విభజన, స్వతంత్ర న్యాయవ్యవస్థ, స్వేచ్ఛాయుత మీడియా, చురుకైన పౌర సమాజం కీలకమైన రక్షణ వ్యవస్థలుగా నిలుస్తాయి.

పాలకులు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. పొగడ్తలు తాత్కాలిక సంతృప్తిని ఇవ్వవచ్చు. కానీ విమర్శలు పాలనలోని లోపాలను సరిదిద్దుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం బలహీనత కాదు.. అది ప్రజాస్వామ్య బాధ్యత. విమర్శకులను శత్రువులుగా చూడకుండా, వారి ప్రశ్నలకు వాస్తవాలతో సమాధానం చెప్పగలిగినప్పుడే పాలనపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది.

ప్రభుత్వాలు మారవచ్చు.. ముఖ్యమంత్రులు మారవచ్చు.. రాజకీయ పార్టీలు అధికారంలోకి రావచ్చు, ప్రతిపక్షంలోకి వెళ్లవచ్చు. కానీ రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు మాత్రం మారకూడదు. ప్రజాస్వామ్యంలో అంతిమ అధికారం ప్రజలదే. ప్రజల గొంతుకను గౌరవించడం, విమర్శలను సహనంతో స్వీకరించడం, ప్రశ్నలకు జవాబుదారీగా ఉండటం ప్రతి పాలకుడి ప్రాథమిక కర్తవ్యం. అదే నిజమైన ప్రజాస్వామ్య పాలనకు గీటురాయి.

మియాపూర్ భూములు ఉద్యమకారుల కుటుంబాలకు కేటాయించాలి

- తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మరియు శేరిలింగంపల్లి ఇంచార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్



శేరిలింగంపల్లి, నవంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) : మియాపూర్ లో ఇటీవల సుప్రీంకోర్టు 100, 101 సర్వే నెంబర్లలో భూములను ప్రభుత్వ భూములుగా గుర్తించి తీర్పునిచ్చిన నేపథ్యంలో సదరు భూములనువాసిలి టి ఆర్ ఎస్ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో సుమారు 30 ఏళ్లుగా 15 వేల పేద మరియు నిరుపేద కుటుంబాలు నివాసముంటున్నాయని అన్నారు. అయితే సుప్రీం కోర్ట్ తీర్పు నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఉంటున్న వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ప్రభుత్వం వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ భూములను అర్హులైన ఉద్యమకారులకు తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన ఉద్యమకారులకు గ్రేటర్ పరిధిలో కనీస గృహవసతి లేని నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. క్షేత్రస్థాయిలో అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న ప్రకటనలు ఇక్కడ నివాసితులను భయాందోళనకు గురిచేస్తున్నాయని చంద్రశేఖర్ ప్రసాద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కలెక్టర్ ఇప్పటికే నివాసం ఉంటున్న వారి జోలికి వెళ్ళమని ఒక పక్కన ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి ఖాళీగా ఉన్న భూముల తో పాటు మొత్తం 550 ఎకరాల భూములను విక్రయిస్తామంటూ ప్రకటించడం ఎవరి మాట నమ్మాలో అర్థం కాని పరిస్థితిలో నివాసితులు భయపడుతున్నారు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థలకు ఇక్కడ భూములను కేటాయించవద్దని ఇవి ప్రభుత్వ భూములు కాదని ప్రజల ఆస్తి అని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఇక్కడ నివసిస్తున్న ఎంఏ నగర్, స్టాలిన్ నగర్, పి ఏ నగర్ మరియు ప్రశాంత్ నగర్ నివాసితులకు అన్యాయం జరిగితే తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పేదల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దీని మీద స్పష్టమైన ప్రకటన చేయాలి అని మరియు ఇక్కడ నివసిస్తున్న నిరుపేద గృహాలను క్రమబద్ధికరించాలని వాసిలి తెలంగాణ రక్షణ సేన పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నారు.కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు గూడ లావణ్య, విష్ణు చారీ , కుమార్ యాదవ్, సుజాత, ప్రవీణ్ బిజిలి, శ్రీనివాస్ నేత,సందీప్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు



శేరిలింగంపల్లి, నవంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) : శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గోపి నగర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లేష్ ముదిరాజ్ అన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్ కేక్ కట్ చేసి మల్లేష్ అన్న కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రవి యాదవ్ మాట్లాడుతు పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ, గోపి నగర్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న సేవలను అభినందిస్తూ, ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మల్లేష్ అన్న కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు మరో కొద్ది రోజులే గడువు!

- నవంబర్ 6లోపు ప్రతి అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాలి.. బాదావత్ సురేష్ విజ్ఞప్తి!



చిన్నగూడూరు, నవంబరు4 (జర్నలిస్ట్ ఫైల్) : నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు గడువు నవంబర్ 6వ తేదీతో ముగియనుందని చిన్నగూడూరు మండల సోషల్ మీడియా అధ్యక్షులు బాదావత్ సురేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో చిన్నగూడూరు మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న అర్హులైన పట్టభద్రులందరూ వెంటనే తమ ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలంటే ముందుగా ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవడం తప్పని సరి అని సూచించారు.చివరి తేదీ దగ్గర పడుతున్నందున నమోదు కోసం చివరి రోజు వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండలంలోని యువత, ఉద్యోగులు, విద్యావంతులు, డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించి తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.నవంబర్ 6వ తేదీలోపు ఓటరు నమోదు పూర్తి చేసుకొని నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని బాదావత్ సురేష్ కోరారు.

కిడ్నీ బాధితురాలికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన వసుధ ఫౌండేషన్



కొత్తగూడెం, నవంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) : కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, వైద్య చికిత్స ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భద్రాచలానికి చెందిన అర్జునపూడి నవతకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక చేయూత అందించింది.వైద్య చికిత్స నిమిత్తం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు తరపున రూ.10,000 ఆర్థిక సహాయాన్ని ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాస్ రాజు బాధితురాలికి అందజేశారు.ఈ సందర్భంగా యువ నాయకుడు కుంజా సంతోష్ మాట్లాడుతూ, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ విద్య, వైద్య రంగాల్లో వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందించి, బాధిత కుటుంబాలకు మనోధైర్యం కల్పించడం గొప్ప మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని, ఫౌండేషన్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అర్జునపూడి సక్కుబాయి, హరిబాబు, రాజేష్, భూక్యా సాయి కౌశిక్, సవలం వంశీ తదితరులు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సదాశివపేట ఏవో



సంగారెడ్డి,నవంబరు4(జర్నలిస్ట్ ఫైల్) : ఎరువుల వ్యాపారం నిరాటంకంగా సాగేందుకు రూ. 20,000 లంచం తీసుకుంటూ సదాశివపేట మండల వ్యవసాయ అధికారి (AO) జి. రమేష్ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.ఫిర్యాదుదారుడి అల్లుడు నిర్వహిస్తున్న ఫెర్టిలైజర్ షాపును ఇబ్బంది పెట్టకుండా చూసేందుకు ఏవో రమేష్ మొత్తం రూ. 30,000 డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా అక్టోబర్ 19న ముందస్తుగా రూ. 10,000 స్వీకరించారు. మిగతా రూ. 20,000 లంచం సొమ్మును తన కార్యాలయంలో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి, నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ విధులను దుర్వినియోగం చేస్తూ అక్రమంగా లంచం డిమాండ్ చేసిన ఏవో రమేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితుడిని హైదరాబాద్‌లోని రెండవ అదనపు ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి : కలెక్టర్ అంకిత్

- కమలాపురం ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ..
- ఆర్ఓ ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశం



కొత్తగూడెం, నవంబరు 4 (జర్నలిస్ట్ ఫైల్) ములకలపల్లి మండలంలోని కమలాపురం ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం రుచి, మెనూ అమలు, ఆహారం అందించే సమయాలపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించాలని, విద్యార్థులకు ప్రతిరోజూ సమతుల్యమైన పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వంటశాల, ఆహార పదార్థాల నిల్వ గదులను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, వంటకు తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులనే వినియోగించాలని స్పష్టం చేశారు. ఆహారం కలుషితం కాకుండా, ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు చోటుచేసుకోకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని మౌలిక సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, పనిచేయని ఆర్ఓ ప్లాంట్‌పై అధికారులను ప్రశ్నించారు. వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్లాంట్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. విద్యార్థులకు నిరంతరం శుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఆహారం, తాగునీరు, వసతి సౌకర్యాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, ఆశ్రమ పాఠశాలలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీలో తహసీల్దార్ స్వాతి బిందు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, నవంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) : మల్కాజిగిరి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వెస్ట్ కాకతీయ నగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. వెస్ట్ కాకతీయ నగర్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా పటిష్టంగా నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ సత్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, రాజ్యలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి, అమీనుద్దీన్, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్, శివ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్రావు, భాగ్యానంద్, సత్యనారాయణ, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, హేమంత్ పటేల్, మాశెట్టి అనిల్, శ్రీనివాస్, సురేష్, చంద్రమౌళి, మల్లేశ్ చారి, బాలకృష్ణ, విజయ్ రెడ్డి, సర్వేష్ యాదవ్, సుబ్బారెడ్డి, సాయి ప్రసాద్, వినీత్, కాల నీవాసులు తిప్పారెడ్డి, బాబురావు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి..

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి



మల్కాజిగిరి, నవంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) : మల్కాజిగిరి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జోనల్ కమిషనర్‌ను కలిసి పలు అభివృద్ధి పనులతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. యాప్రాల్ జంక్షన్, అల్వాల్ హైటెన్షన్ లైన్ ప్రాంతం, కార్గిల్ గేట్ నుంచి బాలాజీనగర్ వరకు రోడ్ల అభివృద్ధి, అల్వాల్‌లో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి ఉన్న అడ్డంకుల తొలగింపు, బండ చెరువు, చిన్నరాయుని చెరువుల అభివృద్ధి చేపట్టాలని కోరారు. మౌలాలి భరత్‌నగర్‌లో ఈతకొలను, ఆర్.కే.పురంలో ఫుట్‌బాల్ మైదానం, డిఫెన్స్ కాలనీలో బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదనపు ఏఓసీ, సీఆర్ఎంపీ రోడ్లు, స్మశానవాటికల్లో మౌలిక వసతులు, సీసీ రోడ్లు, బాక్స్ డ్రైన్లు, పార్కులు, బహిరంగ వ్యాయామశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. విమలాదేవి నగర్‌లో బావి స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేసి ప్రజా ఆస్తులను పరిరక్షించాలని సూచించారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, ప్రతిపాదిత పనులకు త్వరగా నిధులు మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ లక్ష్మణ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, బద్ధం పరశురాం రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, అమీనుద్దీన్, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, హేమంత్ పటేల్, మాశెట్టి అనిల్, శ్రీనివాస్, సురేష్, చంద్రమౌళి, ఇబ్రహీం, మోహన్ రెడ్డి, మల్లేశ్ చారి, బాలకృష్ణ, విజయ్ రెడ్డి, విజయ్ శేఖర్, యాదగిరి గౌడ్, స్థానిక కాలనీవాసులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

అక్షరజ్యోతిగా మూడుదశాబ్దాల అజరామర సేవలు!

- 31 ఏళ్ల ఉపాధ్యాయ ప్రస్థానానికి ఘనమైన గౌరవ వందనం.
- పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయురాలు దమ్ము ఇందిర,రాజన్న.
- రేండ్లగూడలో ఆత్మీయ సన్మానం



జిన్నారం, నవంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) : విద్యాబోధనను వృత్తిగా కాకుండా బాధ్యతగా భావించి, భావితరాల భవిష్యత్తుకు అక్షరజ్ఞానమే పునాదిగా నిలిపిన ఉపాధ్యాయుల సేవలు సమాజ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు వక్తలు కొనియాడారు.31 సంవత్సరాల పాటు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా అంకితభావంతో సేవలందించి పదవీ విరమణ పొందిన దమ్ము ఇందిర,రాజన్నకు రేండ్లగూడ గ్రామంలో ఘనంగా సన్మానం నిర్వహించారు.లక్సెట్టిపేటలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా మూడు దశాబ్దాలకు పైగా విద్యాసేవలు అందించిన ఇందిర,రాజన్న గత నెలలో పదవీవిరమణ పొందారు.ఈ సందర్భంగా గ్రామస్థులు, ప్రముఖులు,వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలిసి ఆమెను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమైనదని, ఒక ఉపాధ్యాయురాలు అందించే విద్యాబోధన వందలాది మంది విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.31 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ సమాజానికి విలువైన సేవలందించిన ఇందిర,రాజన్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ బాధ్యతల నుంచి మాత్రమే విరామమని, సమాజానికి అందించిన సేవలకు మాత్రం ఎప్పటికీ విరామం ఉండదని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్,నిర్మల్ జిల్లా డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారి రామలింగయ్య,తాళ్ల గురజాల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ దేవిరాజం,రేండ్లగూడ మాజీ ఎంపీటీసీ దాముక కరుణాకర్,మమత, మాజీ ఉపసర్పంచ్, ప్రస్తుత వార్డుసభ్యుడు దాముక రాజరత్నం, లక్సెట్టిపేట మాజీ సీడీపీఓ లక్ష్మీకళావతి, భీంపూర్ మండల ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్,సరళ, గ్రామ పెద్దలు దాముక జాన్,సంజీవరావు, అర్జున్,సుధాకర్ తదితరులు పాల్గొని ఇందిర,రాజన్నను ఘనంగా సన్మానించారు.

ఎరువుల అక్రమాలకు అడ్డుకట్ట... రైతుల ప్రయోజనాలే పరమావధి!

- ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు.
- నిల్వలు, విక్రయాల రికార్డులు,ఈ-పాస్ వివరాల పరిశీలన.
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక.




జిన్నారం, నవంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) : రైతులకు నాణ్యమైన ఎరువులను పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అందించడంతో పాటు ఎరువుల విక్రయాల్లో అక్రమాలు,అధిక ధరలకు తావులేకుండా వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమవారం జిన్నారం మండలంలోని కలమడుగు, పాన్మల్,జిన్నారం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేశారు.మండల వ్యవసాయ అధికారి వీరన్నతో కలిసి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి చెందిన సహాయ వ్యవసాయ సంచాలకులు పి.పి. గోపి,వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్ఐఆర్ తనిఖీల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని ఎరువుల విక్రయ కేంద్రాలను సందర్శించి దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయాల రికార్డులు,బిల్లు పుస్తకాలు,ఈ-పాస్ యంత్రాల్లో నమోదైన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు ఎరువుల డీలర్లకు పలు కీలక సూచనలు చేశారు. ప్రతిరోజూ స్టాక్ రిజిస్టర్లను తప్పనిసరిగా నవీకరించాలని, దుకాణాల్లో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలతో కూడిన స్టాక్ బోర్డులను రైతులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ-పాస్ యంత్రంలో నమోదైన నిల్వలకు, వాస్తవంగా దుకాణాల్లో ఉన్న నిల్వలకు ఎలాంటి వ్యత్యాసం ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు అందించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచుతూ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీలర్లకు తెలిపారు.రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు ఎరువులు విక్రయించడం, నిల్వల్లో అక్రమాలకు పాల్పడటం, రికార్డుల్లో తప్పుడు వివరాలు నమోదు చేయడం వంటి చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించారు.రైతుల కష్టార్జితానికి భరోసా కల్పిస్తూ ఎరువుల విక్రయ వ్యవస్థలో పారదర్శకతను కాపాడటమే లక్ష్యంగా వ్యవసాయశాఖ నిరంతర తనిఖీలు, పర్యవేక్షణ కొనసాగిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

కార్మిక నాయకుడు బూడిద గణేష్‌కు ఇనుముల సతీష్ పరామర్శ



మంథని, నవంబరు4(జర్నలిస్ట్ ఫైల్): పెద్దపల్లి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బూడిద గణేష్‌ను మంథని మాజీ ఉపసర్పంచ్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీష్ పరామర్శించారు. ఇటీవల బైపాస్ శస్త్రచికిత్స చేయించుకుని మంథని మున్సిపల్ పరిధిలోని వాగుగడ్డ వీధిలో తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న గణేష్‌ను మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి కలిశారు.ఈ సందర్భంగా గణేష్ ఆరోగ్య పరిస్థితిని, శస్త్రచికిత్స అనంతరం అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న గణేష్ తిరిగి కోలుకుని ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు కాయితోజు సమ్మయ్య పాల్గొని గణేష్‌ను పరామర్శించారు.

33/11 కేవీ విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించిన పంతులు తండా సర్పంచ్ లావుడ్యా చిన్నా నాయక్





అక్కన్నపేట, నవంబరు 4 (జర్నలిస్ట్ ఫైల్) : పంతులు తండా గ్రామ పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను మరియు ప్రమాదకరంగా మారిన చెట్లను గ్రామ సర్పంచ్ లావుడ్యా చిన్నా నాయక్ గారు స్వయంగా దగ్గరుండి తొలగించడం జరిగింది.వర్షాకాలం దృష్ట్యా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్పంచ్ గారు తెలిపారు. విద్యుత్ స్తంభాలు, వైర్లపై పడి ఉన్న కొమ్మల వల్ల తరచూ కరెంటు అంతరాయం ఏర్పడుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధితో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో, వారి భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సర్పంచ్ లావుడ్యా చిన్నా నాయక్ గారి సేవా నిరతికి గ్రామ ప్రజలు, స్థానికులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

నిడదవోలు పట్టణంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ విస్తృత పర్యటన



- తుఫాన్ బాధితులను ఆదుకుంటాం
- పునరావాస కేంద్రాలకు తరలించిన లోతట్టు ప్రాంతాల వాసులను కలిసిన మంత్రి దుర్గేష్
- ఏర్పాట్ల పరిశీలన

నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) : 'మురసు' తుఫాన్ ప్రభావంతో నిడదవోలు పట్టణంలోని లోతట్టుప్రాంతాలను, జరిగిన ఆస్తినష్టం వివరాలపై స్వయంగా రంగంలోకి దిగి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పర్యవేక్షించారు.క్షేత్రస్థాయిలో పర్యటనలో భాగంగా పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో ఆర్ఓబీ కింద రెండు వైపులా ఉన్న షాపుల్లోకి వర్షపు నీరు చేరి వ్యాపారుల స్టాక్ దెబ్బతినడంపై మంత్రి దుర్గేష్ కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. సర్వీస్ రోడ్డు ఎత్తుగా ఉండటం వల్ల నీరు షాపుల్లోకి వచ్చి చేరిందని షాప్ యజమానులు మంత్రికి తెలిపారు.

అలాగే ఆ ప్రాంతంలో సరైన లైటింగ్ లేకపోవడంపై సంబంధిత అధికారులపై మంత్రి దుర్గేష్ ఫైర్ అయ్యారు. తక్షణమే అక్కడ అవసరమైన పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో చర్చించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

'మురసు' తుఫాన్ ధాటికి నిడదవోలు నియోజకవర్గంలో ఏర్పడిన పరిస్థితులను మంత్రి దుర్గేష్ నిరంతరం సమీక్షిస్తున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా నిడదవోలు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల ఇళ్లలో నీళ్లు చేరి ఇబ్బందులు పడుతుంటే వారికి స్థానిక మున్సిపల్ హైస్కూల్ లో పునరావాసం కల్పించారు. ఈ సందర్భంగా వారి వద్దకు వెళ్లిన మంత్రి దుర్గేష్ అక్కడి ఏర్పాట్లును పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు.

ఆప్యాయంగా పలకరించి ఎలాంటి ఆందోళన చెందనక్కర్లేదని, వర్షాలు తగ్గే వరకు ఇక్కడే సేదతీరాలని సూచించారు. బాధిత 50 కుటుంబాలకు అవసరమైన నిత్యావసర వస్తువులు అందిస్తామని చెప్పారు..వర్షం తగ్గాక ప్రభావిత ప్రాంతాల్లో శానిటేషన్ ప్రక్రియ చేపడతామన్నారు. బాధితులు మంత్రి దుర్గేష్ స్పందన పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



- నగర పాలక సంస్థ ఎన్నికల్లో గెలిచిన ఎన్డీయే అభ్యర్థులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి దిశానిర్దేశం

గుంటూరు, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్):ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎన్డీయే కూటమి అభ్యర్థులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకొని, తమ గెలుపునకు అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజేతలందరినీ ఘనంగా సత్కరించి, ప్రత్యేక అభినందనలు శుభాకాంక్షలు అందజేశారు. కూటమి అభ్యర్థులపై అపారమైన నమ్మకంతో గెలిపించిన నగర ప్రజలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధన్యవాదాలు తెలుపుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ డివిజన్లలోని సమస్యల పరిష్కారానికి, సమగ్ర అభివృద్ధికి నిరంతరం అంకితభావంతో పనిచేయాలని కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. అలాగే కూటమి భాగస్వామ్య పక్షాలు పరస్పర సమన్వయంతో, ఐక్యంగా పనిచేస్తూ ప్రజా సంక్షేమ పాలనను ప్రతి ఇంటికీ చేర్చాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్ఛాపురం అభివృద్ధికి కృషి చేయాలి!

- నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ ఆశి లీలావతికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచన
- నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆశి లీలావతి



కోటబొమ్మాళి నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలనకు స్థానిక ఎన్నికల ఫలితాలే నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అందుకే ప్రజలు కూటమి పాలనపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఇచ్ఛాపురం పురపాలక సంఘ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఆశి లీలావతి మంగళవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్ఛాపురం పట్టణ సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. చైర్‌పర్సన్‌గా లభించిన అవకాశాన్ని పదవిగా కాకుండా ప్రజాసేవకు లభించిన బాధ్యతగా భావించాలని హితవు పలికారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఆకాంక్షించారు.

ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు పదవులు అలంకారప్రాయాలు కావని, ప్రజలకు సేవ చేసే గొప్ప బాధ్యతలని పేర్కొన్నారు.

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, కూటమి విజయానికి నిస్వార్థంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులందరినీ కలుపుకొని ప్రజాసేవ, పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆశి లీలావతికి సూచించారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పదవిని బాధ్యతగా భావించండి : ఎమ్మెల్యే నసీర్

- ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లకు అభినందనలు తెలిపిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్):నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందిస్తూ నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ను నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ కార్పొరేటర్లు వచ్చి కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి కార్పొరేటర్లను గెలిపించారని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేయాలని సూచించారు. ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ కలిసికట్టుగా అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో 400 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్పొరేటర్లు ముందంజలో ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యనూ ప్రభుత్వాధికారులు దృష్టికిగానీ, మా దృష్టికిగానీ వెంటనే తీసుకురావాలని చెప్పారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత కార్పొరేటర్లదేనని స్పష్టం చేశారు . పదవి అనేది బాధ్యత మాత్రమేనని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అన్నారు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ సారథ్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు 1,827 మందితో పోలీస్ బందోబస్తు

- జిల్లాలో 724 పోలింగ్ కేంద్రాలు
- 69 హైపర్ సెన్సిటివ్ ప్రాంతాలుగా గుర్తింపు



గుంటూరు, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో నవంబర్ 5న జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

పెదకాకాని, దుగ్గిరాల, మేడికొండూరు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, నల్లపాడు, కొల్లిపర, తెనాలి రూరల్, పొన్నూరు రూరల్, చేబ్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహించే సిబ్బంది నిష్పక్షపాతంగా, క్రమశిక్షణతో వ్యవహరించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఓటర్లతో అనవసరంగా మాట్లాడరాదని, ఎలాంటి పక్షపాతానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.

పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీల గుంపులు, ప్రచార కార్యక్రమాలు, అనధికార కార్యకలాపాలకు అనుమతించరాదని సూచించారు. 200 మీటర్ల పరిధిలో పార్టీ కండువాలు, గుర్తులతో నాయకులు, కార్యకర్తలు ఉండకూడదని తెలిపారు. ప్రతి పార్టీ తరఫున ఒక్క పోలింగ్ ఏజెంట్ మాత్రమే ఉండేలా చూడాలని, ఓటర్లు మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, ఇంకు బాటిళ్లు వంటి నిషేధిత వస్తువులను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

పోలింగ్ సిబ్బంది ముందుగానే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకుని భద్రత కల్పించాలని, రాత్రంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజకీయ పార్టీల నుంచి ఆహారం, ఇతర వస్తువులు లేదా ప్రయోజనాలు స్వీకరించరాదని స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులు అనుమతి పాసులతోనే నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని తెలిపారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ కేంద్రాల్లో ప్రత్యేక వీడియో పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

డబ్బు, మద్యం పంపిణీ వంటి అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పోలీస్ అధికారులకు సూచించారు. రూట్ మొబైల్ పార్టీలు, ఫ్లైకింగ్ ఫోర్స్, స్పెషల్ ఫ్లైకింగ్ ఫోర్స్ సిబ్బంది గ్రామాల్లో నిరంతరం గస్తీ నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని, అప్పటికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు ప్రిసైడింగ్ అధికారి అనుమతితో ఓటు వేసే అవకాశం కల్పించేలా సహకరించాలని ఆదేశించారు.

1,827 మందితో బందోబస్తు

జిల్లావ్యాప్తంగా మొత్తం 1,827 మంది పోలీస్, ఇతర సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరిలో ఇద్దరు అదనపు ఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 34 మంది సీఐలు, 75 మంది ఎస్సైలు, 217 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 370 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 84 మంది మహిళా కానిస్టేబుళ్లు, 185 మంది హోంగార్డులు, 475 మంది మహిళా పోలీస్ సిబ్బంది, 190 మంది ఎన్ఎస్ఎస్, 184 మంది ఎన్సీసీ సిబ్బంది ఉన్నారు.

బందోబస్తులో భాగంగా 68 రూట్ మొబైల్ పార్టీలు, 29 ఫ్లైకింగ్ ఫోర్స్ పార్టీలు, 14 స్పెషల్ ఫ్లైకింగ్ ఫోర్స్ పార్టీలను ఏర్పాటు చేశారు.

724 పోలింగ్ కేంద్రాల వర్గీకరణ

కేంద్రాల కేటగిరీ	లొకేషన్లు	పోలింగ్ స్టేషన్లు
హైపర్ సెన్సిటివ్	69	171
సెన్సిటివ్	46	108
సాధారణం	252	445
మొత్తం	367	724

ప్రతి పోలీస్ సిబ్బంది సామాహా=ఎ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని, అత్యవసర పరిస్థితుల్లో SOS బటన్ ద్వారా సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. మొబైల్ పార్టీలు, ఫ్లైకింగ్ పార్టీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని, వైర్‌లెస్, సెల్‌ఫోన్ల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయాలని ఆదేశించారు.

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.

మురసు తుఫాన్‌లో ప్రజలు ఇబ్బంది పడ్డారు... సహకరించారు

- వేగంగా పునరుద్ధరణ చర్యలు
- 4,217 మందిని 58 పునరావాస కేంద్రాలకు తరలింపు
- 8 ట్రైన్స్ లో ప్రయాణీకులు దాదాపు 5,500 మందికి ఆహార పంపిణీ



గుంటూరు, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుఫాన్ కారణంగా గుంటూరు జిల్లా ప్రజలు ఇబ్బందులు గురయ్యారని, అయినప్పటికీ మంచి సహకారాన్ని అందించారని జిల్లా కలెక్టర్ ని.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ తుఫాను వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు జిల్లా యంత్రాంగానికి అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా కాకుమాను మండలంలో 26.1 సెంటీమీటర్లు, గుంటూరు పశ్చిమ మండలంలో 24.7 సెంటీమీటర్లు, ఫిరంగిపురంలో 24.5 సెంటీమీటర్లు., అత్యల్పంగా దుగ్గిరాల్లో 12.6 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయిందని చెప్పారు. జిల్లాలో సరాసరిన 18.3 సెంటీమీటర్ల వర్షపాతం రెండు రోజుల్లో నమోదయిందని తెలిపారు. మురసు తుఫాన్ లో భారీ నుండి అతి భారీ వర్షాలు నమోదు కావడంతో పాటు తీవ్రమైన గాలులో విజయాన్ని దాంత కాకుమాను, పెదనందిపాడు, పొన్నూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, చేబ్రోలు మండలాల్లో ప్రభావం ఎక్కువ కనిపించిందన్నారు. ఆర్టిజిఎస్ ఎప్పటికప్పుడు తాజా సమాచారం అందిస్తూ అప్రమత్తం చేయడంతో జిల్లా యంత్రాంగాన్ని ముందుగానే సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. 100 వరకు చెట్లు కూలాయని వాటిలో 76 చెట్లు రహదారులపై కూలిపోగా తక్షణం తొలగించి రాకపోకలను పునరుద్దించడం జరిగిందన్నారు. 17 రహదారులు దెబ్బతినగా ఇప్పటికే ఐదు రహదారులను పునరుద్ధరించామని చెప్పారు. రెండు రహదారులు పూర్తిగా కోత గురైందని త్వరితగతిన పునరుద్ధరణతో చర్యలు చేపడుతున్నామని అన్నారు.

ప్రకాశం బ్యారేజీకి వరద నీరు వస్తుందని ఇప్పటికే గేట్లు ఓపెన్ చేయడం జరిగిందని ప్రకాశం బ్యారేజీ దిగువ ఉన్న తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పారు. గుంటూరు – అమరావతి రహదారిలో లాం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో రాకపోకలను నియంత్రణ చేశామని చెప్పారు. తాడికొండ వద్ద 220 సబ్‌స్టేషన్ వద్దకు నీరు చేరగా గల్ఫర్ మెషిన్ లు పెట్టి నీరు తొలగించి విద్యుత్తు పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని అన్నారు. తద్వారా గుంటూరుతో పాటు చాలా మేరకు విద్యుత్తు పునరుద్ధరణ రాత్రికి రాత్రి జరిగిందని వివరించారు. 55 గ్రామాల్లో విద్యుత్తు అంతరాయం కలిగిందని, 20 స్తంభాలు కూలినట్లు ఇప్పటికీ గుర్తించామని చెప్పారు. పది గ్రామాల్లో విద్యుత్తు పునరుద్ధరణ జరిగిందని వివరించారు. మిగిలిన గ్రామాలకు బుధవారం సాయంత్రం నాటికి పునరుద్ధరణ చేయుట జరుగుతుందని అన్నారు.

నల్లమడవాగు, మేకలవాగు తదితర 11 వాగులు ఉన్నాయని చెప్పారు. నల్లమడవాగుకు మూడు చోట్ల గండి పడిందని తెలిపారు. నల్లమడవాగు సామర్థ్యం 18 వేల క్యూసెక్కులు కాగా మంగళవారం 40,000 క్యూసెక్కుల వరకు వచ్చిందని, బుధవారం నాటికి 45 వేల క్యూసెక్కుల వరకు ఉండవచ్చని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం లేదా సాయంత్రం నాటికి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టగలదని ఆశిస్తున్నట్లు చెప్పారు.

రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం రావడానికి అవసరమైన పంట నష్ట అంచనాలను తయారు చేయుటకు చర్యలు చేపట్టామని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు సరైన సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు నష్ట అంచనాలను వేయాలని ఆదేశించామని చెప్పారు.

తుఫాను కారణంగా లోతట్టు ప్రాంతాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న 4,217 మందిని 58 పునరావాస కేంద్రాలకు తరలించి, మంచి ఆహారంతో పాటు చిన్నారులకు పాలు తదితర సౌకర్యాలు కల్పించామని చెప్పారు. 8ట్రైన్స్ లో గల దాదాపు 5,500 మంది ప్రయాణీకులు ఆహార పంపిణీ చేసామన్నారు. 210 మంది గర్భిణీ స్త్రీలను ఆసుపత్రుల్లో సురక్షిత చర్యల్లో భాగంగా చేర్పించడం జరిగిందని పేర్కొన్నారు.

జిల్లాలో తుఫాను, ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకునే విధంగా రహదారులు, వాగులు ఆధునీకరణ చేయాల్సి ఉందని, అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేస్తామని తెలిపారు.

ంఒక ప్రక్క తుఫాను, మరో ప్రక్క ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అధికారులు, ఉద్యోగులు అందుకు అనుగుణంగా సేవలు అందించడం అభినందనీయమని చెప్పారు.

ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

యథావిధిగా కాకుమాను, పెదనందిపాడు, ఫిరంగిపురం ఎన్నికలు



- జిల్లాలో 13 మండలాల్లో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు

గుంటూరు, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్):ఈ నెల 5వ తేదీన యథావిధిగా కాకుమాను, పెదనందిపాడు, ఫిరంగిపురం మండలాల్లో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. మురసు తుఫాను కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఉన్న దృష్ట్యా పోలింగ్ ను ఒక రోజు వాయిదా వేస్తున్నట్లు ముందుగా చెప్పడం జరిగిందని చెప్పారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ తెలిపారు.

మూడు మండలాల్లో జడ్పిటిసి, ఎంపీటీసీ పోలింగ్ ఈ నెల 5వ తేదీ గురువారం జరుగుతుందని, ఈ అంశాన్ని ప్రజలు, రాజకీయ పార్టీ ప్రతినిధులు గమనించి సహకరించాలని కోరారు. ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో 13 మండలాల్లో ఎన్నికలు జరుగుతాయని, ఐదవ తేదీ, గురువారం పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 13 జెడ్పీటీసీ, 2 వందల ఎంపిటిసి స్థానాలు ఉన్నాయన్నారు. ఏడు ఎంపిటిసి స్థానాలు ఏకగ్రీవం అయ్యాయని, మిగిలిన 193 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా జరుగుటకు అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో 43వ డివిజన్ కార్పొరేటర్ గాయత్రి పర్యటన



- పాట్టి శ్రీరాములు నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ పరిశీలన
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ

గుంటూరు, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్): నగరంలో కురిసిన భారీ వర్షం నేపథ్యంలో 43వ డివిజన్ కార్పొరేటర్ రంగావజ్జుల గాయత్రి డివిజన్‌లోని పొట్టి శ్రీరాములు నగర్‌లో పర్యటించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలు, మురుగుకాలువలు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి స్థానిక ప్రజలను కలిసి వర్షం కారణంగా ఎదురైన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో ప్రజలు తనను మంచి మెజారిటీతో గెలిపించారని తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా 43వ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.డివిజన్‌లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి, మేయర్ సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలపాటి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, టీడీపీ, జనసేన నాయకులు రామినేని రవీంద్ర, లక్ష్మయ్య, మైనం లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, తుర్లపాటి ఉదయ భాస్కర్, శేషుబాబు, మైనం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై వెళ్లి తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన జెసి



పెదనందిపాడు/ గుంటూరు, నవంబరు 4 (జర్నలిస్ట్ ఫైల్):మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం పర్యటించారు. రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావుతో కలిసి ట్రాక్టర్ ఎక్కిన జాయింట్ కలెక్టర్ పెదనందిపాడు మండలంలో పర్యటించారు. మండలంలో గల వరగాని, పాలపర్రు గ్రామాల్లో సందర్శించారు. నల్లమడ వాగు ఉధృతితో నీట మునిగిన పొలాలను పరిశీలించారు. ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను తనిఖీ చేశారు. మురసు తుఫాను ప్రభావం జిల్లాలో ఎక్కువగా ఉందని అన్నారు. జిల్లాలో రెండు రోజుల్లో సరాసరిన 18 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని చెప్పారు నల్లమడ వాగులో సామర్థ్యం 18 క్యూసెక్కులు మాత్రమే ఉండగా 40 వేల క్యూసెక్కుల వరకు వరద వచ్చిందని చెప్పారు నల్లమడ వాగు ప్రవాహం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డ్రోన్ల సహాయంతో పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

సీఎం చంద్రబాబుతో మేజర్ జనరల్ జి.శ్రీనివాస్ భేటి



అమరావతి, నవంబరు 04 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణా– ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. సచివాలయంలో ముఖ్యమంత్రితో ఆయన మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఏపీ తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించి స్థానిక మిలటరీ లోకల్ అథారిటీగా వివిధ అంశాలను ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రప్రభుత్వం నుంచి సైనిక దళాలకు పూర్తిస్థాయిలో సహకారం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

నూతన మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు పెమ్మసాని అభినందనలు

- లక్ష ఓట్లకు పైగా మెజారిటీ సాధించడంపై హర్షం
- నగర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచన



గుంటూరు, నవంబరు 4 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగర కార్పొరేషన్ నూతన మేయర్‌గా లక్ష ఓట్లకు పైగా మెజారిటీతో ఎన్నికైన కోవెలమూడి లక్ష్మీ అపర్ణ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెమ్మసాని ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

లక్ష ఓట్లకు పైగా మెజారిటీ సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గుంటూరు నగర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. నగర ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ తనకు శుభాకాంక్షలు తెలిపిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

సెలెక్షన్ కాదు.. వైసీపీకి ప్రజల రిజెక్షన్

- కూటమి విజయంపై జగన్ వ్యాఖ్యలకు సోము వీర్రాజు కౌంటర్



అమరావతి, నవంబరు 4 (జర్నలిస్ట్ ఫైల్): ఎన్నికల ఫలితాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలకు బీజేపీ సీనియర్ నేత , ఎంఎల్‌సీ సోము వీర్రాజు ఘాటుగా స్పందించారు జగన్ అధికారంలో ఉన్న సమయంలో సాగించిన అరాచక పాలనను, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించిన తీరును రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదని విమర్శించారు. జగన్ చేసిన 'ఎలక్షన్ కాదు.. సెలెక్షన్' వ్యాఖ్యలోని అంతరార్థం ఏమిటో తెలియదని, అయితే తమ దృష్టిలో ప్రజల తీర్పు ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అరాచక శక్తుల నుంచి కాపాడుకోవాలనే బాధ్యతతో పాటు అభివృద్ధి, సుపరిపాలనకు మద్దతుగా ప్రజలు కూటమి బలపరిచిన అభ్యర్థులను ఓటు ద్వారా ఎన్నుకున్నారని తెలిపారు. ఇది సెలెక్షన్ కాదని, వైసీపీ అరాచక పాలనకు ప్రజలు ఇచ్చిన ప్రజాస్వామ్య తిరస్కారమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని సోము వీర్రాజు ఎక్స్ (X) వేదికగా జగన్‌కు హితవు పలికారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ మోసాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పోలీసులమంటూ వీడియో కాల్స్ చేసి డబ్బులు వసూలు చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు, నవంబర్ 4 (జర్నలిస్ట్ ఫైల్): డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతూ సీబీఐ, ముంబై పోలీస్, ఢిల్లీ పోలీస్, బెంగళూరులోని ఇందిరానగర్ పోలీస్ స్టేషన్ అధికారులమని పరిచయం చేసుకుంటున్నారని తెలిపారు. పోలీసు యూనిఫాంలో వీడియో కాల్స్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో అక్రమ కార్యకలాపాల్లో ఇరికిస్తామని, అరెస్ట్ చేస్తామని బెదిరించి బాధితుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని వెల్లడించారు. పోలీసులు ఎవరినీ డిజిటల్‌గా అరెస్ట్ చేయరని, డిజిటల్ అరెస్ట్ అనేది చట్టపరమైన విధానం కాదని స్పష్టం చేశారు. ఏ పోలీస్ శాఖ అధికారులు కూడా వీడియో కాల్ ద్వారా అరెస్టులు చేయరని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్‌ను స్వీకరించవద్దని, వ్యక్తిగత, కుటుంబ, బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలను అపరిచితులకు వెల్లడించవద్దని సూచించారు. అరెస్ట్ చేస్తామని బెదిరించి డబ్బులు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ పంపవద్దన్నారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

అనుమానాస్పద కాల్స్, సైబర్ మోసాలపై అత్యవసర పోలీస్ సహాయం కోసం 100 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరగాళ్ల సృష్టించే భయాందోళనలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రతే జిల్లా పోలీసుల ప్రథమ కర్తవ్యమని తెలిపారు.

ఆలపాటి ఆశీస్సులు పొందిన నూతన కౌన్సిలర్లు









తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) : తెనాలి మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్లుగా విజయం సాధించిన వివిధ వార్డుల ప్రజాప్రతినిధులు బుధవారం తెనాలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ, తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

మొదటి వార్డు కౌన్సిలర్ పాలడుగు ప్రణీత్, 10వ వార్డు కౌన్సిలర్ సిఘాకొల్లి సుధారాణి, 12వ వార్డు కౌన్సిలర్ శైలజ రాణి, 20వ వార్డు కౌన్సిలర్ బండారు రవికాంత్, 33వ వార్డు కౌన్సిలర్ మైలా హరికృష్ణ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మర్యాదపూర్వకంగా అభినందనలు, ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డుల అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

ఏపీ మెడ్‌టెక్ ఆవిష్కరణలకు అంతర్జాతీయ గుర్తింపు

- సీఎం చంద్రబాబు నాయకత్వం.. మంత్రి సత్యకుమార్ కృషితో ప్రపంచ వేదికపైకి రాష్ట్ర ప్రగతి
- నవంబర్ 18న లండన్ సదస్సులో మెడ్‌టెక్ ఆవిష్కరణ గురించి వివరించేందుకు రావాలని వైద్య శాఖకు ఆహ్వానం
- ఏపీ ప్రతినిధిగా లండన్ సదస్సుకు వీరపాండియన్





అమరావతి, నవంబరు 4 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన మెడ్‌టెక్ ఆవిష్కరణల విజయాలను అంతర్జాతీయ వేదికపై వివరించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆహ్వానం అందింది. నవంబర్ 18న లండన్‌లో నిర్వహించనున్న హెల్త్‌ఏఐ గ్లోబల్ గవర్నెన్స్ ఫోరమ్‌లో రాష్ట్ర ప్రభుత్వం పాల్గొననుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కృషితో రాష్ట్రంలో ఆధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజారోగ్య సేవలకు అనుసంధానించే దిశగా చేపట్టిన వినూత్న కార్యక్రమానికి ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఏపీ మెడ్‌టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ద్వారా 18 కృత్రిమమేధ ఆధారిత వైద్య సాంకేతిక పరిష్కారాలను 14 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసి, 12 వేల మందికి పైగా రోగులకు సేవలు అందించడం రాష్ట్ర ప్రగతికి నిదర్శనంగా నిలిచింది.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్), ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపీఐఎస్) సహకారంతో ఏపీ మెడ్‌టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ 2025--26 కార్యక్రమాన్ని చేపట్టింది. దేశవ్యాప్తంగా వైద్య సాంకేతిక రంగంలో వినూత్న పరిష్కారాలను గుర్తించి, ప్రభుత్వ వైద్య వ్యవస్థలో పరీక్షించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమానికి 297 దరఖాస్తులు అందగా, నిపుణుల మూల్యాంకనం అనంతరం 18 వైద్య సాంకేతిక ఆవిష్కరణలను ఎంపిక చేశారు. వీటిని 14 జిల్లాల్లో 37 రోజుల పాటు ప్రయోగాత్మకంగా అమలు చేసి, 12 వేల మందికి పైగా రోగులకు సేవలు అందించారు.

లండన్ వేదికగా విజ్ఞాన మార్పిడి.. పరిశోధన సహకారం

హెల్త్‌ఏఐ గ్లోబల్ గవర్నెన్స్ ఫోరమ్‌లో ప్రపంచవ్యాప్తంగా వైద్య, సాంకేతిక, ప్రభుత్వ విధానాల రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు. ఈ వేదికపై ఏపీ మెడ్‌టెక్ కార్యక్రమ ఫలితాలను వివరించడంతో పాటు, అంతర్జాతీయ ఉత్తమ విధానాలను తెలుసుకునే అవకాశం రాష్ట్రానికి లభించనుంది.

యూనివర్సిటీ కాలేజ్ లండన్, వెల్‌కమ్ ట్రస్ట్, యూకే హెల్త్ సెక్యూరిటీ ఏజెన్సీ, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్ తదితర సంస్థల ప్రతినిధులతో విజ్ఞాన మార్పిడి, పరిశోధన సహకారం, వైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై చర్చించనున్నారు.

ప్రపంచ దేశాల ప్రతినిధులతో అంతర్జాతీయ వేదిక

ఈ సదస్సులో భారత్, బ్రిటన్, సింగపూర్, జాంబియా, పెరూ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నైజీరియా, డెన్మార్క్, దక్షిణాఫ్రికా, ఉగాండా, పోర్చుగల్, అమెరికా, స్వీడన్, బ్రెజిల్, స్విట్జర్లాండ్, గ్వాటెమాలా, టాంజానియా, సమోవా, కొలంబియా, చైనా, కెనడా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, స్పెయిన్ తదితర దేశాలకు చెందిన ప్రభుత్వ, వైద్య, పరిశోధనా సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధ వినియోగం, బాధ్యతాయుతమైన సాంకేతిక విధానాలు, వైద్య సేవల్లో ఆవిష్కరణల విస్తరణపై చర్చించనున్నారు.

ఏపీ ప్రతినిధిగా లండన్ సదస్సుకు వీరపాండియన్

లండన్‌లో నవంబర్ 18న నిర్వహించనున్న హెల్త్‌ఏఐ గ్లోబల్ గవర్నెన్స్ ఫోరమ్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆహ్వానం అందింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీ జి. వీరపాండియన్ ఐఏఎస్ ఈ సదస్సుకు హాజరుకానున్నారు. రాష్ట్రంలో మెడ్‌టెక్ పరిష్కారాల అమలు తీరు, పనితీరు, ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాలను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించనున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ సాయికాంత్ వర్మ

- ఉధృత స్థాయిలో వరద ఉన్నప్పటికీ ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహకారంతో పెదనందిపాడు వైపుకు చేరుకున్న కలెక్టర్



పెదనందిపాడు/ గుంటూరు, నవంబరు 4 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుఫాను ప్రభావిత ప్రాంతాలైన పెదనందిపాడు కాకుమాను ప్రత్తిపాడు మండలాల్లో జిల్లా కలెక్టర్ సియం. సాయికాంత్ వర్మ బుధవారం పర్యటించారు. ఉధృత స్థాయిలో వరద ఉన్నప్పటికీ ఎన్డిఆర్ఎఫ్ బృందాల సహకారంతో పెదనందిపాడు వైపుకు చేరుకుని పరిస్థితులను అంచనా వేశారు. ప్రజల ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్నారు. నల్లమడ వాగు ప్రవాహాన్ని గమనించారు. ప్రజలందరూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని కోరారు. సంబంధిత అధికారులు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వాగు దిశగా ఎవరు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. నల్లమడ వాగు ప్రవాహం వలన ఇబ్బందులు గురవుతున్న అన్ని గ్రామాల పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైతే స్థానికంగా ఆహారాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. జల వనరుల శాఖ వాగు ప్రవాహాన్ని పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు ఇంకా 23 గ్రామాలకు విద్యుత్తు పునరుద్ధరణ చేయాలని త్వరితగతిన చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వరద ముంపు, తుఫాను ప్రభావాన్ని పూర్తిగా అంచనా వేయుటకు డ్రోన్లు ద్వారా పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లాలో తుఫాను, ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకునే విధంగా రహదారులు, వాగులు ఆధునీకరణ చేయాల్సి ఉందని, అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేస్తామని తెలిపారు.

ఎన్నికల సిబ్బంది రాకపోకలు గమనించాలి

ఎన్నికలసిబ్బంది రాకపోకలను కాకుమాను, ఫిరంగిపురం, పెదనందిపాడు మండలాల్లో గమనించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆయా మండలాల్లో కొన్ని గ్రామాలకు వెళ్లుటకు రహదారులు పరిస్థితిని పూర్తిస్థాయి లో గమనించాలని స్పష్టం చేశారు. అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాల సేవలను వినియోగించుకోవాలని సూచిం చారు. గురువారం సాయంత్రం వరకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలను స్థానికంగా ఉంచాలని చెప్పారు.

జిల్లాలో 13 మండలాల్లో ఎన్నికలు జరుగుతాయని, ఐదవతేదీ, గురువారం పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 13 జెడ్పీటీసీ, 2 వందల ఎంపిటిసి స్థానాలు ఉన్నాయన్నారు. ఏడు ఎంపిటిసి స్థానాలు ఏకగ్రీవం అ–య్యాయని, మిగిలిన 193 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా జరుగుటకు అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.. నగర అభివృద్ధికి సమష్టి కృషి

- కూటమి మేయర్, కార్పొరేటర్ల ఘన విజయంపై క్యాపిటల్ హోటల్‌లో ఆత్మీయ సమావేశం
- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. అన్ని డివిజన్లకు సమాన ప్రాధాన్యం: కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు, నవంబరు 4 (జర్నలిస్ట్ ఫైల్): నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులు సాధించిన విజయాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక క్యాపిటల్ హోటల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్లను నాయకులు అభినందించారు.

ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గుంటూరు నగర ప్రజలు కూటమి ప్రభుత్వానికి అందించిన విజయానికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కాంగ్రెస్, వైసీపీకి అనుకూలంగా ఉన్న డివిజన్లలోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించారని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని, అప్పగించిన బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తూ పారదర్శకమైన ప్రజాపాలన అందిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ అభ్యర్థులు గెలిచిన డివిజన్లలోనూ ఎలాంటి వివక్ష లేకుండా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించామని పెమ్మసాని తెలిపారు. 2021లో జరిగిన ఎన్నికల నిర్వహణకు భిన్నంగా ఈసారి గుంటూరు నగరంలోని ఏ డివిజన్‌లోనూ ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా ఎన్నికల ప్రక్రియ కొనసాగిందన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తనకు, వైసీపీకి మధ్య సుమారు 25 శాతం ఓట్ల తేడా ఉండగా, ప్రస్తుత నగరపాలక ఎన్నికల్లో కూటమికి 32 శాతానికి పైగా ఓటర్ల మద్దతు లభించిందని పేర్కొన్నారు.

ప్రధాని, సీఎం, పవన్ కృషితో విజయం: రామాంజనేయులు

నాయకుడు రామాంజనేయులు మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి సాధించిన విజయానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి ఉందన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ పెమ్మసాని చంద్రశేఖర్ వారంలో రెండు, మూడు రోజులు నియోజకవర్గంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 50 శాతం మహిళలు, 30 శాతం బీసీల భాగస్వామ్యంతో జరిగిన ఈ ఎన్నికల్లో విజయం సాధించిన మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు కార్పొరేటర్లందరికీ అభినందనలు తెలిపారు.

ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యం: నసీర్ అహ్మద్

ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల నిర్వహణలో ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవిస్తూ ఎన్నికలు నిర్వహించిందన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి కష్టపడి పనిచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి గడపకు చేరుకుని సమస్యలు పరిష్కరిస్తాం: గల్లా మాధవి : ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ గుంటూరు ప్రజలు అందించిన విజయాన్ని కూటమి నాయకులు, కార్యకర్తలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి గడపకు చేరుకుని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో నగర అభివృద్ధికి పనిచేస్తామని పేర్కొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం: కిలారి రోశయ్య

జనసేన నాయకుడు కిలారి రోశయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం ఈ ఎన్నికల ద్వారా మరోసారి వెల్లడైందన్నారు. రాబోయే రోజుల్లో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. మేయర్ లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్ల విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలే విజయానికి కారణం: తిరుపతిరావు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపిన గుంటూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకంతో పాటు పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో తీసుకొచ్చిన నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహమ్మద్ నసీర్ అహ్మద్, రామాంజనేయులు సహా కూటమి నాయకుల కృషిని అభినందించారు.

అభివృద్ధిని వేగవంతం చేస్తాం: పిల్లి మాణిక్యరావు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించిన గుంటూరు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు సమన్వయంతో పనిచేయడం ద్వారా ప్రజల మద్దతు పొందగలిగామని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలోనూ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

ఈ సమావేశంలో కూటమి నాయకులు, నూతనంగా ఎన్నికైన మేయర్, కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com